తెలుగులో వెలువడుతున్న ఏకైక హాస్య మాస పత్రిక


# హాస్యానందం

సంపూర్ణ హాస్య మాస పత్రిక

నవంబర్-2024

వెల: ₹20





# PRIYANKA PANDA
## DESIGNER STUDIO

**One stop shop for your designer wear**

**Women ✤ Men ✤ Kids**



## Designing & Stitching

Call: +919959222411.

email: labelpriyankapanda@gmail.com

తెలుగులో వెలువడుతున్న ఏకైక హాస్యమాస పత్రిక జీ'వనం'లో నవ్వు నవ వసంతం

# హాస్యానందం

నవంబర్-2024 21వ సంవత్సరం 245 వ సంచిక

ముఖచిత్రం: శ్రీలీల ✦ కార్టూన్: బాచి

Editorial Office:
**HASYANANDAM**
# 8-215/4, Near Ramalayam,
**Po:YERRABALEM-522 503**
Mangalagiri Mandal, Guntur dist.
*Ph* : **9849630637**
email: **hasyanandam.mag@gmail.com**
web: **www. hasyanandam.com**

*Full Pillar* : Bnim
*Cartoon Feature Editor*: Bachi

*Creative Team*
Dr. K.Ramakrishna, Bachi
Kandlakunta SarathChandra
Vadlamannati Gangadhar,
GopalKrishna, Gandhi, Nagisetty,
Bomman, Dayakar, Sangram, Krishna

*D.T.P:* P. Ramalakshmi, 9440304993
*Digital Media Director:* Surya

*Publisher& Editor-*
*Ramu.P*

*Well Wishers:*
Dr.K.V.Ramanachary, *(I.A.S.Retd)*
Tanikella Bharani
Dr.Sudarsan
K.V.V.Satyanarayana
Gudibandi Venkata Reddy
Dr.V.V.Rama Kumar

*Prize Sponsers*
K.V.V.Satyanarayana,
*Cartonist* JSR
K.Sundaresayya &
Satyavathi
Md.Raj Mohammed
Nimmi Madhubala
Mallika, Lakshmi
G.Venkat Reddy
Padmadas

| సంవత్సర చందా-రూ.300/- (పోస్టల్ చార్జీలతో) | 2 సంవత్సరాల చందా-రూ.500/- (పోస్టల్ చార్జీలతో) |
|---|---|

**జీవిత చందా- రూ.5000/-లు**

Gpay *or* Ppay # **9849630637**

**Hyderabad & Secunderabad Distributor:**
M.Panduranga,
**Risingsun News Agency**
Abids, Hyderabad. Cell. 9666680857.



Smile in Every Page...Satisfaction in Every Smile

# ఎక్కడెక్కడ ఏమేమున్నాయి?...


## కథలు

| | | |
|---|---|---|
| అయ్యారే! రొట్టె ముక్క | -సింహాద్రి నాగశిరీష | -18 |
| కిలకిలలు గలగలలు | -నల్లబాటి రాఘవేంద్రరావు | -30 |
| అతిథి దేవో భవ | -కంచనపల్లి ద్వారకనాథ్ | -38 |
| మై హూనా... | -'అభిమన్యు' | -44 |
| ఎన్నికల్లో ఎన్ని కళలో? | -బుద్ధవరపు కామేశ్వరరావు | -48 |

## స్పెషల్స్

| | | |
|---|---|---|
| ఓ మాయదారి దోమ | -గోపాలకృష్ణ | -17 |
| నాగుల చవితి నవ్వులు | | -35 |
| జోక్స్ జోన్ | -ముత్యాల శ్రీశరత్‌బాబు | -46 |

## శీర్షికలు

| | | |
|---|---|---|
| ఈనెల ప్రోత్సాహక బహుమతులు | | -8 |
| తెలుగా మజాకా?! | -డాక్టర్ కప్పగంతు రామకృష్ణ | -10 |
| కొత్త పుస్తకాలు | | -25 |
| వెనక్కి వెళ్ళే కథలు | -వడ్లమన్నాటి గంగాధర్ | -28 |
| వాక్చిత్రం | -సుధామ | -36 |
| నవ్వులాట | -గాంధీ మనోహర్ | -42 |
| స్మైల్ స్టార్స్ | -మోహన్ కుమార్ | -26 |
| పదానందం | -పోపూరి విశ్వనాథ్ | -50 |

## సీరియల్


| | | |
|---|---|---|
| కొంగుచాటు కృష్ణుడు | -యండమూరి వీరేంద్రనాథ్, యర్రంశెట్టి శాయి | -12 |

## కార్టూన్ శీర్షికలు

| | | |
|---|---|---|
| అబ్బాయి పెళ్ళి | -జయదేవ్ | -14 |
| నవ్వుకొమ్మచ్చి | -సరసి | -15 |
| రిటైర్డ్ లైఫ్ | -బొమ్మన్ | -40 |
| కా.కా.క.క. | -బాచి | -41 |
| ఈ నెల దినం | -రామ్‌శేషు | -43 |











## ఈ సంచికలో కార్టూనిస్ట్‌లు

- ✦ జయదేవ్
- ✦ సరసి
- ✦ గోపాలకృష్ణ
- ✦ శర్మ
- ✦ బాచి
- ✦ శేఖర్
- ✦ రామ్‌శేషు
- ✦ గాంధీ
- ✦ నాగిశెట్టి
- ✦ గౌతమ్
- ✦ వాడ్రేవు
- ✦ మోహన్ కుమార్
- ✦ శంబంగి
- ✦ ప్రసాద్ కాజ
- ✦ జాకీర్
- ✦ రవీంద్ర
- ✦ ప్రసిద్ధ
- ✦ చక్రవర్తి
- ✦ ఓంకార్
- ✦ బొమ్మన్
- ✦ శేషయ్య
- ✦ బీవీఎస్
- ✦ సునీల్
- ✦ పద్మ
- ✦ టి.ఆర్.బాబు
- ✦ ఎమ్.ఎమ్.మురళి
- ✦ కాశ్యప్
- ✦ తోపల్లి ఆనంద్
- ✦ శేషి
- ✦ టి.భాస్కర్

**గమనిక:**

ఈ పత్రికలో ప్రచురింపబడే వ్యంగ్య, హాస్య రచనలు, కార్టూన్లు కేవలం హాస్యం కోసం ప్రచురించినవి మాత్రమే. ఏ వ్యక్తిని గాని, సంస్థని గాని కించపరచాలన్నది అభిమతం కాదు. ఇందులో ప్రచురించిన రచనలన్నీ ఆయా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే.

# హాయ్...సానందంగా...

**హాస్యానందం అభిమానులకు... ఆప్తులకు... హాస్యప్రియులకు...సన్నిహితులకు హాస్యాభివందనాలు!**

**పొ**ద్దున లేచిన దగ్గర్నుంచి మనకెన్నో ఆలోచనలు వస్తుంటాయి... ఏవేవో చేయాలని... అయితే అవి ఆచరణలోకి ఎన్ని తీసుకొస్తున్నామన్నదే సమస్య! ప్రపంచ పరిణామక్రమంలో ఆలోచనలే ప్రధాన పాత్రలు!... మనకు వచ్చే ఆలోచనలు ఆ క్షణంలో చేసేయాలని ఉత్సాహంగా అనుకుని...కొద్ది సేపటి తరువాత 'మనవల్ల' కాదులే... అనుకుంటూ దాన్ని విరమించేస్తాం! కానీ ఒక ప్రయత్నం చేస్తేనే కదా మన వల్ల అవుతుందా... కాదా అనేది తెలిసేది... మనం ఏం చేయాలన్న కావలసినది శ్రద్ధ, ఆ పని పట్ల అంకితభావం... మన ఆలోచనను ఆచరణలో పెట్టాలంటే ముఖ్యంగా కావలసినది 'ఆశ'! మన వలన కాదనుకుని వదిలేయడం కంటే ఒక ప్రయత్నం చేస్తే దాని లోతెంతో తెలుస్తుంది... లోటుపాట్లేమిటో తెలుస్తాయి... ముఖ్యంగా ఆ పని సఫలీకృతం కాకపోయిన ఒక 'అనుభవం' మిగులుతుంది. ఎవరి మెప్పు కోసమో... మన ఉనికి చాటుకోడానికో మన స్థాయి దాటి చేసే ఆలోచనలు మానుకుని, మనం చేయగలిగే...మనకు చేతనయ్యే పనులు మాత్రమే ఆచరణలో పెట్టాలి. లేదంటే అభాసుపాలు కావటం తథ్యం!

ఈ మధ్య ఒక ఎనభై ఏళ్ళ పెద్దాయనను కలిసాను. ఆయన కొన్ని 'ఆలోచనలు' చెప్పారు. ఆశ్చర్యమేసింది... ఆ వయస్సులో కూడా 'ఏదో' చేయాలనే ఆ తపన నాకు మంచి స్ఫూర్తినిచ్చిందనే చెప్పాలి! ఆయనే అన్నారు... 'మన ప్రయత్నమంటూ చేస్తేనే కదా? మన ఆలోచన ఎలాంటివో అర్ధమవుతుంది'.అని. ఇక్కడ గమనించాల్సింది వయస్సుతో నిమిత్తం లేకుండా హుషారుగా మన ఆలోచనల్ని ఆచరించడానికి ఉండాల్సింది చిత్తశుద్ధి మాత్రమే... వయస్సు కాదు! చాలామంది మేము పెద్దవాళ్ళమయి పోయాము... ఈ వయస్సులో ఏం చేయగలం అని అంటుంటారు. కానీ వయస్సు శరీరానికే కానీ మనస్సుకు కాదు అనేది గమనిస్తే... 'ఆ' స్టేట్‌మెంట్ వాళ్ళు ఇవ్వరు. ఆ పలాయనవాదం... వాళ్ళను వాళ్ళు కించపరుచుకోవడమే కానీ మరేమి కాదు!

మన మనుగడకి మెట్లుగా ఉపయోగపడే ఆలోచనలు మన పరిధిలో చేయడానికి ప్రయత్నిస్తూనే... అనుభవాలు, అనుభూతులు సొంతం చేసుకుని... సరికొత్త 'తృప్తి'ని ఆస్వాదిద్దాం!

అందరూ హాయిగా, ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటూ.....








✦ **పి.వి. మధు నివ్రితి, సికింద్రాబాద్**

**అట్ట** మీద కార్టూన్‌లో బాబు దీపావళి టపాసు (బాంబు) పేలుస్తూ, చరవాణిలో సెల్ఫీ తీసుకోవటం సృజనాత్మకంగా ఉన్నది. పి.రాముగారి హాయ్...సానందంలో ప్రతి పండుగ పరమార్థం చెడుపై మంచి గెలవటం అని, పండుగ రోజులు అనురాగం–ఆత్మీయతలు–నీతి–మంచి పంచుకుంటూ గడపాలి. ఆస్తులు –అంతస్తులు–డాలర్–మోజులు– ఆశలతో... గొయ్యిలు తవ్వుకుంటూ కాదు, కష్టాలు–నష్టాలు కలిగించు కుంటూ కాదు అని చెప్పకనే చెప్పింది మీ సంపాదకీయం. 'ప్రతి నెలా బహుమతులు' స్ఫూర్తి దాయకం. ఈ సారి 'తెలుగా మజాకా'లో మాస్టర్ లకే మాస్టర్ అయిపోయారు రామకృష్ణగారు. భవానీగారి కార్టూన్, ఒక్క తెలుగు ట్యూషన్ క్లాస్‌కు 5000 రూపాయిలు, అన్ని వేరే సబ్జెక్టులకు 2000 మాత్రమే... ఇది జోకా? నిజమా? ... అన్న భావన కలిగించింది.

✦ **తూలుగు రమణారావు అక్కరాపల్లి**

**జ్యోతిష్యం**,వాస్తు అంశంగా ప్రచురించిన కార్టూన్స్ ఎంతగానో నవ్వించాయి. ఫిట్టింగ్ పంకజం కథ బాగుంది. పంకజం లాంటి వాళ్ళు ఈ సమాజంలో ఎంతో మంది ఉన్నారు. అలాంటి వారి మంజుల,పద్మావతి మాత్రమే కాదు.ఎంతో మంది మేలుకొని కాపురాలు చక్కదిద్దుకోవాలని రచయిత సూచన ప్రాయంగా వెల్లడించారు. ఇంకా దీపావళి ప్రత్యేక కార్టూన్స్ బాగున్నాయి. ఇలాగే మన పత్రిక వందేళ్లు నవ్వులు పంచాలని కోరుకుంటున్నాము.

✦ **శ్రీలేఖ పి.ఎస్., హైదరాబాద్**

**దీ**పావళి (అక్టోబర్ 2024) ప్రత్యేక సంచిక 'ప్రత్యేకమైన ప్రకాశం' (రంగురంగుల వెలుగు) విరాజిల్లింది మరియు ధమ ధమ లాడించింది కూడా (అట్ట మీద బొమ్మ యే కాదు, లోపల కథలు, శీర్షికలు కూడా). రెండింతలు హాస్యం–సంతోషం! 'వాక్చిత్రం' లో సుధామగారు చక్కగా సెలవిచ్చారు... మన రోజు వాడుక భాషలో దీపావళి తాండవిస్తుంది అని... ముఖం మతాబాలా వెలిగి పోయిందని, జువ్వలా దూసుకు పోయాడు ఇతరత్రా). శరత్ చంద్ర గారి కథలో టపాకాయలు మాట్లాడుకోవటం కొత్తదనం – సృజనాత్మకత కొట్టొచ్చినట్టు ఉంది. అన్ని టపాసుల పేర్లు (తెలుగులో) పునరావృత్తం అయింది.






# గుళ్ళపల్లి అరుణకుమారి స్మారక కార్టూన్ పోటీ-2025

హాస్యానందం సౌజన్యంతో

ప్రముఖ కార్టూనిస్ట్ **శ్రీ దాస్ గారి శ్రీమతి గుళ్ళపల్లి అరుణ కుమారిగారి స్మారకార్థం** వారి కుమార్తెలు **శ్రీమతి స్పందన, శ్రీమతి సునీలలు** ఈ కార్టూన్ పోటీ నిర్వహిస్తున్నారు.


| మొదటి బహుమతి | రెండవ బహుమతి | మూడవ బహుమతి | 5 ప్రత్యేక బహుమతులు |
|---|---|---|---|
| రూ. 3,500/- | రూ. 2,500/- | రూ. 1,500/- | రూ. 500/- ఒకోక్కటి |

కార్టూన్లు ఈ మెయిల్‌కి పంపవలెను- gcpadmadas@gmail.com

బహుమతి ప్రదానోత్సవ సభ డిశంబర్ 25న విజయవాడలో నిర్వహించబడుతుంది.
వేదిక వివరాలు డిశంబర్ హాస్యానందంలో ప్రకటిస్తాం!

కార్టూన్లు చేరవలసిన ఆఖరు తేదీ : 20-11-2024

మరిన్ని వివరాలకు: బాచి - 9848992433, పద్మదాస్ -8985226622



## డా॥కె.వి.రమణ, ఐ.ఎ.ఎస్(రి) ఆశీస్సులతో
## గుదిబండి వెంకట రెడ్డి, హాస్యానందం సౌజన్యంతో నిర్వహిస్తున్న కార్టూన్ పోటీ

శ్రీ గుదిబండి వెంకట రెడ్డి గారు కార్టూనిస్టులను ప్రోత్సాహించాలనే సదుద్దేశంతో ఈ కార్టూన్ పోటీ నిర్వహిస్తున్నారు. కార్టూనిస్టు మిత్రులు అందరూ పాల్గొనాలని మా మనవి

**10 బహుమతులు**
**ఒకోక్కటి 3000 రూపాయలు**

మెమెంటో
+
సర్టిఫికెట్

కార్టూన్లు చేరవలసిన ఆఖరి తేదీ: డిశంబర్, 10, 2024
ఈ మెయిల్‌కి కార్టూన్లు పంపవలెను. hasyanandampoteelu@gmail.com

**నిబంధనలు**

- 'అంశం' ఏదైనా ఫరవాలేదు గానీ నవ్వు పుట్టించేలా కార్టూన్లు ఉండాలి. దయచేసి అశ్లీల అంశాల జోలికెళ్ళొద్దు!
- పోటీలో పాల్గొనే కార్టూనిస్టులు, తాము పంపే మెయిల్‌లో పేరు, ఫోన్ నెంబరు తప్పని సరిగా ఉండాలి!
- బహుమతి ప్రదానోత్సవ సభ **ఫిబ్రవరి 2025 లో హైదరాబాదులో జరుగుతుంది.** వివరాలు ఫిబ్రవరి హాస్యానందంలో ప్రచురిస్తాం!

## ఈ నెల ప్రోత్సాహక బహుమతులు

**4000 రూపాయల బహుమతులు**


మన కార్టూనిస్ట్‌లను ప్రోత్సాహించాలనే సదుద్దేశంతో **ప్రతి నెలా** హాస్యానందంకు వచ్చిన కార్టూన్‌లలోంచి కొన్ని మంచి కార్టూన్లకు **ఇచ్చే ప్రోత్సాహక బహుమతులు.**




'కార్టూన్ మిత్ర'

**శ్రీ కె.వి.వి.సత్యనారాయణగారు**

**ఈ కార్టూన్‌కి రూ.1000/-లు** బహుమతిగా ఇస్తున్నారు.






**శ్రీమతి నమ్మి మధుబాల**


**(బాపు) రమణల లోగిలి-ఫేస్బుక్ గ్రూప్)**


కార్టూన్ కళ పై ఆరాధనతో... ఈ మూడు ప్రోత్సాహక బహుమానం ఇస్తున్నారు.

← మొదటి బహుమతి- **రూ.500/-లు**

↙ రెండవ బహుమతి- **రూ.300/-లు**


↓ మూడవ బహుమతి- **రూ.200/-లు**






కార్టూనిస్ట్ **శ్రీ జె.ఎస్.ఆర్.**
(జె.శ్రీరామచంద్రమూర్తి గారు)
వారి తల్లి దండ్రుల జ్ఞాపకార్థం
**ఈ కార్టూన్‌కి 500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.







**శ్రీ కుప్పచ్చి సుందరేశయ్య,**
**శ్రీమతి సత్యవతి వార్లు**
**ఈ కార్టూన్‌కి 500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.







కార్టూనిస్ట్
**ఎమ్.డి. రాజ్ మహమ్మద్ గారు**
ఈ కార్టూన్‌కి
**500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.






**దివ్యశ్రీ శ్రీమతి చిట్టావఝుల యల్లారి**
**బాల వెంకట సత్య సూర్యకాంతం** జ్ఞాపకార్థం
కుమార్తెలు **మల్లిక, లక్ష్మీ** అందిస్తున్న
ప్రోత్సాహక బహుమానం-
**500 రూపాయలు**




## ప్రతి నెలా బహుమతులే!

కార్టూనిస్టు మిత్రులకు నమస్కారం. ప్రతి నెలా హాస్యానందంకు వచ్చే కార్టూన్లలోంచి **8 మంచి కార్టూన్లకు బహుమతులు** ఇస్తున్నారు కార్టూన్ ఇష్టులు! మీరు ఇక నుంచి పంపే కార్టూన్లకు బహుమతి రావాలనే ఉద్దేశంతోనే కార్టూన్లు గీయండి! సందేశాలున్నప్పటికీ హాస్యం మాత్రం 'మిస్' కాకుండ చూస్తొంటే... మీకు బహుమతి 'మిస్' అవ్వదు. ఆల్ ది బెస్ట్!




డాక్టర్ కప్పగంతు రామకృష్ణ
*తెలుగు అధ్యాపకుడు, కె.బి.ఎన్ కళాశాల, విజయవాడ*
90320 44115

**ఆధునికత పెరిగిన ఇప్పటి తరంలో భాష కూడా ఎన్నో ఆధునిక పోకడలు పోతోంది. దీని వల్ల అర్థాలు మారి అనర్థాలు జరుగుతున్నాయి. తెలుగు మాట్లాడే క్రమంలో జరిగే పొరపాట్లు, వాటివల్ల జరిగే తప్పులు, వాటిని సరిచేసుకోవాల్సిన విధానాలు అందరికీ తెలియజేయాలనే సంకల్పంతో... భాషా చమత్కారాన్ని ఉపయోగిస్తూ చేస్తున్న ప్రయత్నం ఇది.**

**(గత సంచిక తరువాయి)**

**"శ్రీ**వారూ..."అంటూ కేక వినిపించింది.

అమ్మో! రత్నం బడిక్కూడా వచ్చేసిందా? అనుకుంటుండగానే నా వైపు చూసి ముసిముసి నవ్వులు నవ్వుతున్న ఏకాంబరం కంట పడ్డాడు.

ఆఁ!... అర్థమైంది. బడిలో జరుగుతున్నదంతా చూసి నా రత్నానికి ఏకాంబరం ఫోన్ చేసి పిలిపించాడు.

"ఇదిగో వస్తున్నా...." అంటూ మరోసారి శ్రీవారు అని పిలవడానికి రత్నానికి అవకాశం ఇవ్వకుండా వడివడిగా బడి బయటకు వచ్చేసా.


రెండోసారి పిలిస్తే ఏమవుతుందో మీకూ తెలుసుగా!

✦✦✦

"ఏమిటండీ రాను రాను మీ పోకడ ఇలా తయారవుతోంది... ఏదో నలుగురిలో బాగా మాట్లాడతారని, సభా నిర్వహణ బాగా చేస్తారని ఇలా అయినదానికీ కానిదానికీ మిమ్మల్ని పంపటమేనా అని అడుగుతున్నా... అసలు మీకు మాత్రం బుద్ధి ఉందా అని... హవ్వ! హవ్వ... నలుగురిలో నా ప్రతిష్ట ఏమైపోవాలండీ. ఏదో నా అంత కాకపోయినా మా ఆయన కూడా మేధస్సు కలిగినవారేనని ఇప్పటిదాకా నలుగురిలో చెప్పుకుంటున్నా. ఇహ నాకా హక్కు పోయిందండీ. అయ్యో... అయ్యో... ఆయనేం మనిషండీ... రాజకీయ సభలకు మిమ్మల్ని వెళ్ళమంటారా? అంతపెద్ద మనిషే ఇలా చేస్తే ఇక నా బాధ ఎవరికి చెప్పుకోను స్వామీ... కీచుపిట్ట పెద్ద గొంతుతో అరిచినట్టు, గొంతుకలో ఈల అడ్డుపడిన వ్యక్తి బిగ్గరగా అరిచినట్టు, అడవిజంతువులన్నీ ఒకేసారి గోలపెట్టినట్టు... ఏమిటో ఆ శబ్దాలన్నీ కలిసినట్లు విపరీతమైన స్వరంతో అరుస్తోంది రత్నం.

నిజానికి రత్నం ఏడుస్తోందని అందరూ అనుకోవాలని తన కోరిక. శబ్దం తప్ప రత్నం ఎందుకు అరుస్తోందో... అందులో ఏ ఒక్క పదమూ సరిగ్గా వినబడటం లేదు. అనుభవం ఉన్న వాడిని కాబట్టి కొద్దికొద్దిగా అర్థం చేసుకోగలుగుతున్నా. అసలేం జరిగిందో చెప్పుకునే అవకాశం కూడా రత్నం ఇవ్వడం లేదు.

కనీసంగా తన వాక్ప్రవాహానికి అడ్డుకట్ట వేసే ప్రయత్నం కూడా చెయలేకపోతున్నాను. ఇప్పటికే చుట్టుపక్కల ఇళ్ళవాళ్ళకు అనుమానం వచ్చే ఉంటుంది... నేనేదో అఘాయిత్యం చేసానని. ఆ... అదిగో.... అనుమానం ఏం ఖర్మ. రానే వచ్చింది.




కొద్దికొద్దిగా మనుషులు మా ఇంటిముందు పోగవుతున్నారు. హోరు గాలిలో వాన నీటిలో పడవ ప్రయాణం అంటూ సినిమా పాట కూడా సరిగ్గా ఇదే సమయంలో వస్తోంది.. నన్ను వెక్కిరించడానికి ఆకాశవాణి కూడా సిద్ధమైందా అన్నట్టు.

రేపొద్దున్న పత్రికల్లో 'భర్త అఘాయిత్యానికి భార్య విలవిల' అనే శీర్షికతో వార్త వచ్చినా రావచ్చు. బాబోయ్... తలచుకుంటేనే భయం వేస్తోంది.

నాకు ఊపిరితీసుకునే శుభఘడియలు వచ్చాయో ఏమో కానీ రత్నం కాస్త కుదుట పడింది.


ముందుగానే సిద్ధం చేసుకున్న మర చెంబుతో నీళ్ళు అందించాను.


"అదికాదే రత్నం... ఇప్పటికిప్పుడు నీ ప్రతిష్టకు వచ్చిన భంగం ఏమీ లేదు. ఎందుకంటే **ప్రతిష్ట** అనకూడదు. **ప్రతిష్ఠ** అనాలి. అందువల్ల నీ ప్రతిష్ఠ ఎక్కడికీ పోదు. ఇక నీ మేధస్సు కూడా ఏమీ కాదు. ఎందుకంటే, **మేధస్సు** అనే పదమే లేదు. **మేధ** అని మాత్రమే అనాలి. నీ మేధ సంగతి అందరికీ తెలిసిందే కనుక దానికీ ఏ ప్రమాదమూ రాదు...

ఇక, చివరగా నీ భాధ ఎవ్వరికీ చెప్పవద్దు. ఎవ్వరూ వినరు. ఎందుకంటే, నీకెంత కష్టం కలిగినా దాన్ని **బాధ** అనాలే కానీ **భాధ** అనకూడదు. కాబట్టి, ప్రస్తుతానికి నువ్వు శాంత పడటమే అన్నివిధాలా ఉత్తమం..." అంటూ శ్రీకృష్ణుడు అర్జునుడికి భగవద్గీత బోధించిన తీరులో ఉపన్యాసం దంచికొట్టేసా!

"అనండి... అనండి. నన్నుకాక ఇంకెవర్ని అంటారు. అన్నిటినీ నేనొక్కదాన్ని దొరికాను మీకు! అయ్యో అయ్యో... నిక్షేపం లాంటి బెంగళూరు సంబంధం కాదనుకుని గవర్నమెంట్ ఉద్యోగం అంటూ తెలుగు టీచరికిచ్చి నా గొంతు కోసారే... మా నాన్నని అనాలి." రత్నం అఘాయిత్యం కొనసాగుతూనే ఉంది.

"నాన్నా! అమ్మ ఇప్పుడెవర్నీ పట్టించుకునే స్థితిలో లేదు. నువ్వు నెమ్మదిగా జారుకో..." అని నా బంగారుతల్లి మనోజ్ఞ చెవిలో నెమ్మదిగా చెప్పడంతో...ఇద్దరం దొంగతనంగా పాలు తాగిన పిల్లుల్లా అక్కడనుంచి జారుకున్నాం. **(సశేషం)**






గుడికి ఎందుకు వెళ్ళాలి?
ప్రదక్షణలు ఎందుకు చెయ్యాలి? అందుకు నియమాలేమిటి?
ఆలయానికి గోపురం, మండపాలు ఎందుకు ఉండాలి?
ఆలయానికి ధ్వజస్తంభం లేకపోతే ఏమవుతుంది?
ఆలయాల్లో బలి ఎందుకు వేస్తారు? అసలు బలి అంటే ఏమిటి?
పూజకు సంకల్పం ఎందుకు చెప్పాలి?
షోడశోపచార పూజ అంటే ఏమిటి?
పూజ చివరలో మంత్రపుష్పం ఎందుకు చెబుతారు?
ఇంకా ఎన్నో సందేహాలు...

అన్నిటికీ సమగ్రమైన, సశాస్త్రీయమైన సమాధానం చెప్పే గ్రంథం

'తెలుగా మజాకా?!' రచయిత
డాక్టర్ కప్పగంతు రామకృష్ణ రచన
దేవుణ్ణి చూద్దాం... రండి!




కాపీలకు: 9494875959 / 9493875959 / 9849181712 / 8142444967





కథ-కథనం
యండమూరి వీరేంద్రనాథ్
యర్రంశెట్టి శాయి






# కొంగుచాటు కృష్ణుడు



**గతంలో...** మనుషుల్ని సృష్టించడం చాలా సులభమని, భర్తతో సవాలు చేసి సరస్వతి ముగ్గురు మగ పిల్లల్ని, ఇద్దరు ఆడపిల్లల్ని సృష్టించింది. సరస్వతి సృష్టించిన మొదటి మనిషి పేరు మల్లెమాల బోసు. స్కూల్లో సైన్స్ టీచరు. కెమిస్ట్రీ ల్యాబులో రహస్యంగా చేస్తున్న ప్రయోగం ఫలించక ఆత్మహత్య చేసుకోవాలనుకుంటాడు. సరస్వతి సృష్టించిన రెండోవాడు గూటాలపల్లి ఆనందరావు, స్వతహాగా మంచివాడు. అమ్మాయిల కోసం ఎన్ని వేషాలైనా వేయటానికి వెనుదీయక పోవటం ఒక్కటే అతడి చెడుగుణం. మూడోవాడి పేరు సాత్వికరావు, పరమ సాత్వికుడు! బ్యాంకులో పని చేస్తూ ఉంటాడు. తనతో పని చేసే హరిత అతన్ని ఆట పట్టిస్తుంటుంది. సరస్వతి సృష్టించిన రెండో అమ్మాయి రాధ. కస్తూరిబా గర్ల్స్ కాలేజీ పక్కన హోటల్ నడుపుతుంటుంది. **ఆ తర్వాత...**

**"గుర్రపు స్వారీ ఎక్కడ నేర్చుకున్నారు? ఊటీ కొండల మీదా?... లేక డెహ్రాడూనా?" అని అడిగింది.**

**ఈ ప్రశ్నకి అతడు బిత్తర పోయాడు సాత్వికరావు.**

**"లేదు! నేను ఆ రెండు కొండలూ ఎక్కలేదు. ఐ మీన్... ఆ రెండు ప్రదేశాలూ వెళ్ళలేదు. ఎత్తైన కొండలంటే నాకు భయం... ఎందుకలా అడిగారు?" అని ప్రశ్నించాడు.**

**"నిన్న రాత్రి మీరు... అబ్బ... మార్వలెస్!"**

అదిరిపడి, "నిన్న రాత్రా? ఎవరు? ఎవరితో? ఎప్పుడు? ఎక్కడ? ఎలా? ఎందుకు?... ఏ..మి..టి మార్వలెస్?" అంటూ తడబడ్డాడు

"అమాయకత్వమనే నివురు గప్పిన నిఖార్సైన నిప్పు కణిక మీరు!"

తమ మాటలు ఎవరయినా వింటున్నారేమో అని కలవరపాటుతో చుట్టూ చూశాడు సాత్వికరావు.

"మీ గది గాంధీనగర్‌లో కదా! మరి నన్ను ఇంకెక్కడో రూంకి తీసుకెళ్ళారేమిటి? ఆ గది ఇలాంటి వేషాల కోసమా?"

"రూమంటేనే గది. గది అంటే రూము. రూమేమిటి? గదేమిటి? మీరేం మాట్లాడుతున్నారు?"

మరింత దగ్గరగా జరిగి చెవి దగ్గర మొహం పెట్టి రహస్యంగా... "పెదాల మీద సుతారంగా పెట్టుకోవాలి గానీ, మరీ బుగ్గల మీద అంత గట్టిగానామ్మా కొరికేది? మా చెల్లీ, అమ్మా ఆ గాట్లేమిటని అడిగారు... మూడు దోమలు ఒకేసారి కుట్టాయని కుంటిసాకు చెప్పలేక చచ్చాను!" అంది.

సాత్వికరావు శరీరం వణకసాగింది.

"పెదాల మీద బుగ్గల గాట్లేమిటండీ? మీరేం మాట్లాడు తున్నారో నాకు అర్థం కావటం లేదు!" అన్నాడు.

"పెదాల మీద బుగ్గలు కాదు. బుగ్గల మీద పళ్ళు. అహ:!... పాపం. సీసా నోట్లో పెట్టినా పాలు తాగలేని పాపాయి కదూ! అందుకేగా 'కాసేపు రూమ్‌లో సరదాగా మాట్లాడుకుందాం రా' అని తీసుకెళ్ళి అర్ధరాత్రి దాకా..."

సాత్వికరావుకి ఒళ్ళంతా చెమటలు పట్టాయి.

'ఈవిడ తనని ఆటలు పట్టిస్తోంది. లేకపోతే అర్ధరాత్రి దాకా రూమేమిటి? పళ్ళ మీద బుగ్గల గాట్లేమిటి?' అను కున్నాడు.

అంతలో కౌంటర్‌లోకి కస్టమర్స్ రావటంతో మాట్లా డటం ఆపి ఆమె పనిలో పడింది.

అయినా మధ్యమధ్యలో అతనిని ఓరకంట చిలిపిగా చూసి నవ్వుతూనే ఉంది. ఆమె చూసినప్పుడల్లా సాత్విక రావు ఒళ్ళు వణికిపోతోంది.

కాసేపటి తరువాత మళ్ళీ విరామం లభించగానే అత నికి సమీపంగా జరిగి... "ఇవ్వాళ సాయంత్రం కూడా వెళ్దామా?" అంది.

సాత్వికరావుకి ఒళ్ళు తడిచిపోయింది చెమటతో.

కంగారుగా "ఎక్కడికి?" అని అడిగాడు.

"జోక్స్ చాల్లే! నాకు తనివి తీరటం లేదు. నిన్నటి అనుభవం ఇప్పటికీ కలలోలా ఉంది. బుట్టలో పెట్ట లాంటి నువ్వు, సంక్రాంతి పందెంలో పుంజులా ఎలా అయ్యావా

అని ఆశ్చర్యంగా కూడా ఉంది. ఏదైనా ఊరపిచ్చుక లేహ్యం వాడావా?"

"ఊరకుక్క లేహ్యమా?"

"శక్తి పెరగటానికి 'ఏదైనా ఊర పిచ్చుక లేహ్యం వాడావా?' అని అడుగుతున్నాను."

"ఊరపిచ్చుక లేహ్యమూ లేదు. కాకిరెట్ట పేస్టూ లేదు!" వళ్ళు మండి ధైర్యం తెచ్చుకుని అన్నాడు.

"పోన్లే. ఆ సంగతి పక్కన పెట్టు. ఇవ్వాళ మళ్ళీ వెళ్దామా?"

"ఇదిగో చూడండి మిస్! మీరు మాట్లాడేది నాకేమీ అర్థం కావటం లేదు. నేను నిన్న సాయంత్రం మా ఇంటి దగ్గర టేబుల్ టెన్నిస్ ఆడుతున్నాను."

ఆమె సిగ్గుగా నవ్వి, "నిన్న రాత్రి నీ గదిలో టేబుల్ టెన్నిస్ బల్ల మీద వ్యవహారం గుర్తుకు తేవటానికి అంటున్నావు కదూ!... చి...లి...పి!" అంది.

సాత్వికరావు గొంతు తడారిపోయింది.

"టెన్నిస్ టేబులా?" అన్నాడు.

"మరీ అంత అమాయకంగా నటించకండి సార్. సరే గానీ ఇవాళ సాయంత్రం కూడా... ఓకేనా?!" అనేసి మళ్ళీ తన పనిలో పడి పోయింది.

సాత్వికరావు నిశ్చేష్టుడయి కూర్చుండిపోయాడు. హరిత తనను ఇంతకాలం ఆట పట్టించినా ఎప్పుడూ 'ఈ విధంగా' మాట్లాడలేదు. నిన్నరాత్రి జరిగిన విషయాలన్నీ చెప్తున్నప్పుడు ఆమె ముఖంలో కనిపిస్తోన్న సిగ్గూ, చిలిపితనం కళ్ళల్లో కనబడుతోన్న ఆ మెరుపూ... ఒక వేళ...తను చదివిన నవలలు, చూసిన సినిమాలూ గుర్తొచ్చాయి. వాటిల్లో కూడా ఇంచుమించుగా ఇలాగే జరుగుతుంది. హీరోయిన్‌ని అల్లరిపెట్టే వాడొకడయితే, ఆమె పేచీ పడేది ఇంకొకరితో.

"సాత్వికరావు గారూ!" హరిత మళ్ళీ దగ్గరగా జరిగింది.

"ఏమిటండీ?"

"నిన్న మీరు చెప్పినట్టూ నిజంగా మనం వచ్చే నెల తిరుపతిలో పెళ్ళి చేసుకుందామా?"

అదిరిపడి కుర్చీలోంచి గెంతేశాడు. భళ్ళుమన్న శబ్దంతో టోకెన్లన్నీ క్రింద పడ్డాయి.

కర్చీఫ్‌తో చెమటలు తుడుచుకుంటూ... "ఏమిటండీ? పెళ్ళా?" అన్నాడు.


"అది కూడా మర్చిపోయారా?" చిరుకోపంతో అడిగింది.


"మర్చిపోవటం ఏమిటి? అసలు మీరు ఇదంతా నన్నేడిపించటానికి చెప్తున్నారు కదూ?"

"ఇంకా నయం! నిన్నేడిపించటానికని రాత్రంతా నీతో గడుపుతానా? 'శీలం' అంటే అంత తేలిగ్గా ఉందా? అసలు ఇంతకూ నీ ఉద్దేశ్యమే మిటి? పెళ్ళి ఎగ్గొడదామనా?" అంటూ ఏకవచనంలోకి దిగింది.

తమ మాటలు ఎవరయినా విన్నారేమోనని చుట్టూ చూశాడు.

మాధవి, హిరణ్మయి తమ వంకే చూడటం గమనించేసరికి గుండెల్లో రాయి పడింది.






"నేనసలు.." అనబోయాడు.

నవ్వేసి... "చూడూ! పెళ్ళి సంగతి నువ్వే ఎత్తావు గనుక సరేనన్నాను. వద్దనుకుంటే చెప్పేయ్. ఏం ఫర్లేదు. పెళ్ళి మీద నాకంత పెద్ద పట్టింపేమీ లేదు. ఒట్టి టేబుల్ టెన్నిస్ తోనే సరి పెట్టుకుంటాను. సరేనా?" అంది.

సాత్వికరావు ఆమె వంక గుడ్లప్పగించి చూస్తుండిపోయాడు.

జీవితాన్ని పిండిన అనుభవంతో ఆమె అన్నది– "అయాం లక్కీ సాత్విక్. కొందరికి అందం ఉంటుంది. శక్తి ఉండదు. కొందరికి శక్తి ఉంటుంది. హుషారు ఉండదు... శక్తీ, హుషారు, అందం, ఈ మూడూ ఉన్నవాళ్ళకి రొమాంటిక్ ఫీల్ ఉండదు. ఈ నాలుగూ ఉన్న నీతో ఒక రాత్రి మధురమైన అనుభవం పొంద గలిగానూ అంటే ఈ జీవితానికి ఇది చాలు సాత్వికరావ్! అయితే ఒక్క విషయం... నీ మనసు మార్చుకుంటే చెప్పు. నీ కళ్ళల్లోకి చూస్తూ నేను జీవితాంతం గడపగలను. నీ చెయ్యి వాసన చూస్తూ అన్నం తినకుండా కూడా ఉండగలను. నువ్వు పక్కనుంటే పరుపు లేకుండా పడుకోగలను!" అనేసి మళ్ళీ తన పనిలో మునిగిపోయింది.

ఈ లోపులో క్యాబిన్ లోంచి మేనేజర్ పిలిచి, "రాంగ్ ఎంట్రీ పడింది. జాగ్రత్తగా చూసుకో!" అంటూ లెడ్జరు అతని ముందుకి తోశాడు.

సాత్వికరావు వెనక్కి వచ్చి రాంగ్ ఎంట్రీని రైట్ చేస్తూండగా ముందుగా గాలిలో తేలినట్టు అయింది. తరువాత ఎగ్జార్సిస్ట్ సినిమాలోలా శరీరం గాలిలో సగం లేచింది. ఆపై మెడ దగ్గర బిగుసుకున్నట్టు అయింది.

కాలర్ దగ్గర ఎవరివో రెండు మృదువైన చేతులు కనపడ్డాయి. అవి కాలర్ పట్టుకుని తనని పైకి లేపు తున్నట్టూ గ్రహించాడు... తలెత్తి చూసేసరికి కౌంటర్‌కి అటువైపు ఓ అందమైన అమ్మాయి తన శరీరాన్ని గాలిలోకి లేపుతోంది.

ఆమె వెనుక ఓ పోలీస్ ఇన్‌స్పెక్టరూ, ఇద్దరు కానిస్టేబుల్సూ ఉన్నారు.

బ్యాంక్‌లో అందరూ తెల్లబోయి సినిమా చూస్తున్నట్టు వాళ్ళ వైపే చూడసాగారు.

"ఇదిగో ఇతనేనండీ... ఇతనే ఆ రోజు రాత్రి మా ఇంట్లో జొరబడి... నన్ను..." అంటూ చెంప మీద కొట్టింది.

ఇన్‌స్పెక్టరు కౌంటర్ మీద చేతులు పెట్టి ముందుకు వంగి–

"నిజమేనా?!" అన్నాడు కర్కశంగా.

(ఆ రోజుల్లో కంప్యూటర్లు లేవు. జమా ఖర్చులు పుస్తకాల్లో వ్రాసేవారు.)

వణుకుతున్న గొంతుతో– "ఏమిటి నిజ మేనా?" అన్నాడు సాత్వికరావు.


"ఈ అమ్మాయి చెపుతోంది నిజమేనా?" అన్నాడు ఇనస్పెక్టరు.

"ఆ అమ్మాయి చెబుతోంది నిజమో కాదో నాకు ఎలా తెలుస్తుంది సార్? నేను ఏమన్నా లై–డిటెక్టర్‌నా?" అని అమ్మాయి వైపు తిరిగి

"ఏయ్! ఏమిటిది? కాలరు వదులు..." అన్నాడు.

"నీ అంతు తేల్చకుండా కాలరు వదలితే నాపేరు రాధ కాదు" అంది.

"రాధ అంటే... నరకాసురుణ్ణి చంపింది. ఆవిడేనా?" అంది పక్క బల్ల క్లర్కు.



“కాదు. ఆవిడ రుక్మిణి!” అన్నాడు పక్కనున్న స్వప్రకటిత జ్ఞాని.

ఈ గొడవంతా చూసి ఆ బ్రాంచి లోనే పని చేసే యూనియన్ లీడర్ హడావుడిగా వచ్చి... “ఏమిటమ్మా! ఏమిటిది? ఏం జరిగింది? ముంద తని కాలరు వదులు!” అంటూ విడి పించబోయాడు.


సాత్విక్ కాలర్ వదిలి అతని కాలర్ పట్టుకుంది రాధ.

యూనియన్ లీడర్ బెదిరి పోయాడు. ఇంతకాలం తను మేనే జ్మెంట్ కాలర్ పట్టుకున్నాడే గానీ, ఈ అనుభవం ఇంత ఉక్కిరిబిక్కిరిగా ఉంటుందని ఇప్పుడే తెలిసింది.



నవ్వు కొమ్మచ్చి

సరసి




అక్కడ జనమంతా– అమ్మాయిని సపోర్ట్ చేసే కస్టమర్లు, సాత్వికరావుని సపోర్ట్ చేసే ఉద్యోగులు– రెండు వర్గాలుగా విడి పోయారు.

యూనియన్ లీడర్ కోపంగా, “మీరుండి కూడా ఏమిటీ దౌర్జన్యం ఇన్‌స్పెక్టర్‌గారూ! డ్యూటీలో ఉన్న కాలర్లను ఆ అమ్మాయి అలా పట్టుకుంటే చూస్తూ ఊరుకుంటారేమిటి?” అని అడిగాడు.

“వాడు చేసిన పని బాగుందేమిటి?”

“ఏం చేశాడేమిటి?”

“ఏం చేశాడా? నిన్న రాత్రి పన్నెండు గంట లకు ఆ అమ్మాయి ఇంట్లో జొరబడి అసభ్యంగా ప్రవర్తించాడు”

“నేనా? ఇంపాజిబుల్!” అన్నాడు సాత్విక రావు.

పక్కనున్న హరిత జెలసీతో మండిపోతూ, “ఓహో! అయితే నీకు రాత్రి పన్నెండింటి వరకూ ఒక షిఫ్టూ, రాత్రి పన్నెండు నుంచి ప్రొద్దున్న ఆరింటి వరకూ మరో షిఫ్టూ కావా లన్న మాట!” అంది.

జనం దృష్టి హరిత వైపు మళ్ళింది.

సాత్విక్ వైపు జెలసీతోనూ, ఆమె వైపు ఆశ తోనూ చూశారు మగాళ్ళు.

అందులో ఒక ముసలాయన తాను యవ్వ నంలో కోల్పోయినది తల్చుకుంటూ...

“వీడు చాలా పెద్ద గ్రంథ సాంగుడిలా ఉన్నాడే...” అన్నాడు.

“ఈ ఫీల్డ్‌లో బాగా రీసర్చ్ చేస్తున్నట్లున్నాడు. మన్మధా యూనివర్సిటీలో డాక్టరేట్ ఇవ్వాలి.” పదోక్లాసు పదిసార్లు తప్పిన మరొకడు అన్నాడు.

అందరూ ఘొల్లుమన్నారు.

సాత్వికరావుకి కళ్ళ నీరొకటే తక్కువ... వణుకుతున్న స్వరంతో “నాకేం తెలీదండీ. ఈ అమ్మాయి ఎవరో నాకు తెలీదు... అసలింత వరకూ ఈమె మొహం కూడా చూళ్ళేదు...” అన్నాడు నిజాయితీగా.

ఆ యువతి లీడర్ కాలర్ వదిలి మళ్ళీ సాత్వికరావు కాలర్ పట్టుకుంది.


“ఏమిటీ?... నా ముఖం ఇంత వరకూ చూళ్ళేదా? అంటే నీక్కావలసింది బాడీ అన్న మాట. దానికి తల లేకపోయినా పర్లేదు. అంతేనా?...” అంది.


ఈ థియరీ బావుందనిపించి “మీనింగ్‌ఫుల్” అన్నాడు ఇన్‌స్పెక్టర్.

“ఏది?... మొహం చూడకుండా వ్యవహా రమా?” అన్నాడు జనంలోంచి ఒకడు.

“చాలామంది మొగుళ్ళు చేసేది అదేగా!” అన్నాడింకొకడు.

మళ్ళీ నవ్వులు.






వాటిల్ని అధిగమిస్తూ యూనియన్ లీడర్ ఇనస్పెక్టరుతో గట్టిగా– "అతన్ని వదలండి!" అన్నాడు.

ఆ కంఠాన్ని డామినేట్ చేస్తూ– "ముందు ఈ లీడర్ని అరెస్ట్ చెయ్యండి!" అని అరిచింది ఆ యువతి.

"అతని మీద కేసు ఏమీ లేదే..." నసిగాడు ఇనస్పెక్టరు.

"అవన్నీ తరువాత చూద్దాం. నేను పర్స నల్‌గా వచ్చి మీతో మాట్లాడతాను."

ఆ రెండోవాక్యంలో రెండు... మూడు... నాలుగు... పదములు నచ్చి, "త్రీ నాట్ త్రీ, ఇతన్ని వ్యాన్‌లో పడెయ్!..." అన్నాడు ఇన్‌స్పెక్టరు.

"అఖిలభారత బ్యాంక్‌లన్నిటినీ బంద్ చేయించండి. పోలీస్ జులుం డౌన్! డౌన్!!" అంటూ యూనియన్ లీడర్ అరుస్తూ ఉండగా ఇద్దరు కానిస్టేబుల్సూ బయటికి లాక్కెళ్ళారు.

బ్యాంక్ మేనేజర్ క్యాబిన్లోంచి బయటకు వచ్చి– "ఎక్స్‌క్యూజ్‌మీ. సదా మీ సేవలో... నేనేమయినా మీకు సహాయం చేయగలనా? అసలేం జరిగింది?... ఏవిఁటీ గొడవ?" అని అడిగాడు.

"ఇతను నిన్న రాత్రి ఈ యువతి ఇంట్లో జొరబడి అసభ్యకరంగా ప్రవర్తించాడు." అరిగి పోయిన రికార్డులా మళ్ళీ చెప్పాడు ఇన్‌స్పెక్టర్.

మేనేజరు, సాత్వికరావు వైపు... అదోలా చూస్తూ... "వెరీ బ్యాడ్! కుర్రాళ్ళందరూ పెళ్లి మానేసి ఇలా కక్కుర్తి పడటం వల్లనే ఆడపిల్ల లకి పెళ్ళిళ్ళు అవటంలేదు!" అన్నాడు పెళ్లి కాని తన కూతుళ్ళని తల్చుకుని.


"కాదు! అమ్మాయిల కోరికలు కోటలు దాట టం వల్లనే అబ్బాయిలకి పెళ్లి అవటం లేదు!" అన్నాడు ఇనస్పెక్టరు తన ముప్ఫై ఏళ్ల కొడు కుని తల్చుకుని.

"అంతా అబద్ధం సార్! నేనసలు..." అన బోయాడు సాత్విక్ కల్పించుకుని.

"షటప్!" అందా యువతి.

"నువ్విలా అంటావనే నేను సాక్ష్యుల్ని కూడా తీసుకొచ్చాను... ఒరే నాగులూ... భద్రం..." అంటూ పిలిచింది.

రెండు శాల్తీలు జనం మధ్యలోంచి ఈదు




కుంటూ ముందుకు వచ్చాయి.

"అమ్మాయిగారు చెప్పింది నిజమేనండీ. నిన్న అర్ధరాత్రి పన్నెండు గంటలకు మేము హోటల్ మూసేసి అమ్మాయిగారిని వాళ్ళింట్లో దిగబెట్టి మళ్ళీ హోటల్‌కి వెళ్తోంటే, ఇదిగో ఇతను అమ్మాయిగారి ఇంట్లో జొరబడ్డాడండి."

"ఒంటరి అమ్మాయి ఇంట్లో అలా అర్ధరాత్రి జొరబడుతూ ఉంటే చూస్తూ ఊరుకున్నారా?" లీగల్‌గా ప్రశ్నించాడు సి.ఎ.ఐ.ఐ.బి పరీక్ష వ్రాస్తున్న మానేజరు.

"పాత స్నేహితుడనుకున్నామండీ!" అన్నాడు నాగులు అమాయకంగా.

జనంలో మగాళ్ళు ఆశగానూ, స్త్రీలు ఈర్ష్య గానూ రాధ వైపు చూశారు.

రాధ మొహం ఎర్రబడింది.

"అమ్మాయిగారు కేకలు వేసి అందరినీ పిలు చుకొచ్చేసరికి గోడదూకి పారిపోయాడండీ!" ముక్తాయించాడు రాములు.

సాత్వికరావు నిస్త్రాణగా కుర్చీలో కూలబడి పోయాడు.

"హోటలంటారేమిటి వీళ్ళు?" అడిగాడు మేనేజరు.

"రాధావిలాస్ హోటల్ ప్రొప్రయిటర్ని నేను. సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ స్కీములో మీరిచ్చిన లోన్‌తోనే హోటల్ పెట్టాను."

"ఓ...ఐసీ" అన్నాడు మేనేజర్.

"...కానీ నేనింతవరకూ నా సర్వీసులో ఎవరికీ లోన్ ఇవ్వలేదే!" **(సశేషం)**


ఓ మాయదారి దోమ



# అయ్యారే! రొట్టె ముక్క

సింహాద్రి నాగశిరీష-9866689326

**ఈ రోజుతో నేను ముప్పైతొమ్మిది నిండి నలభయ్యవ వడిలో అడుగు పెట్టాను. అందుకు నాకైతే ఏ బాధాలేదు కానీ మావారికి మాత్రం మహా సంతోషంగా ఉంది. నా శరీరం తీరో లేక నా అదృష్టమో తెలియదు కానీ, ఇద్దరు పిల్లల తల్లినే అయినా అందరూ నన్ను ఇరవైఐదేళ్ళ అమ్మాయిననే అనుకుంటారు. దానికి తోడు నేను చీరలు కట్టుకోను. పిల్లల కోసం తీసే ఉరుకుల పరుగులలో చీర కడితే ఎక్కడ బోర్లాపడతానోనని భయం. నైటీలకు ఆమడ దూరం.**

**ట్రాక్స్, జాగర్స్ మాత్రమే వేసుకునే అలవాటు. దాంతో ఎక్కడికి వెళ్ళినా అంతా నన్ను, నా కూతురిని అక్కాచెల్లెళ్ళు అనుకోవటం పరిపాటి.**

మా గురించి తెలిసినవారందరూ నన్ను 'సంతూర్ మమ్మీ' అని పిలుస్తుంటారు. దాంతో మా ఆయనకి ఎక్కడలేని ఉడుకుమోత్తనం. 'బయటకు వెళ్ళేటప్పుడన్నా చీరలు కట్టుకో కూడదా' అంటూ ఒకటే సణుగుడు.

అదంతా చీరకట్టుపై అభిమానం అనుకుంటే తప్పులో కాలేసినట్టే. మేమిద్దరం ఆయన గారికి కూతుళ్ళలా, ఆయన మా తండ్రిలా అనుకుంటారేమోనన్న భయం. నిజానికి అలా అనుకునే అవకాశాలు కూడా లేకపోలేదు. మా ఆయన నాకంటే రెండేళ్లు పెద్ద. ఆయన ముసలిగా కనబడరు కానీ వయసుకు తగ్గట్టుగా ఉంటారు. కొంచెం పొట్ట కూడా వచ్చిందండోయ్. ఎటొచ్చీ వచ్చిన చిక్కల్లా... నేను మాత్రం యూత్‌లా కనిపిస్తా. అదన్నమాట సంగతి.

ఆయనకు నలభైరెండు. నాకిప్పుడు నలభై వచ్చాయిగా... పాపం ఆనందం పట్టలేక ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నారు. నిజానికి అందరం హోటల్‌కు వెళ్ళి భోజనం చేయాల్సింది. కానీ ఆ ముందురోజే పాడైపోయిన మాంసం, ఆహారం నిల్వలు, ఏమాత్రం హైజీన్ లేని కిచెన్‌లు, సీజ్ అయిన హోటళ్ళు... గట్రాగట్రాల గురించి వార్తల్లో చూసి భయపడి ఆ ప్రయత్నం విరమించుకున్నాము.

మేమే కాస్త ఒళ్ళు వంచి చక్కగా ఇంట్లోనే బిర్యానీ వండుకున్నాం. అయితే ఇక్కడో ఆసక్తికరమైన విషయం చెప్పాల్సి ఉంది. అదేంటంటే... నలభైల్లో పడ్డాం కాబట్టి, ఇక ఆరోగ్యం పట్ల చాలా అప్రమత్తంగా ఉండాలనీ, చక్కగా గోధుమరొట్టెలు తినాలనీ, ఫిట్‌గా తయారవ్వాలనీ... అందుకు గాను నార్త్‌ఇండియన్ డైట్‌మెయింటెయిన్ చేయాలనేది మావారి ప్రపోజల్.

మన వరకూ బాగానే ఉంది. కానీ పిల్లల సంగతేమిటన్నాను.

'రోటీలే పెడదాం. ఏం? నార్త్‌లో పిల్లలు రొట్టెలు తినటంలేదా?' అన్నారు మావారు.


తనకు తెలియనివి కూడా తెలిసినట్టే కాన్ఫిడెంటుగా చెప్పటం మావారి ప్రత్యేకత. ఎన్నిసార్లు ఎదురుదెబ్బలుతిని పళ్ళు రాలగొట్టుకున్నా... మావారి కాన్ఫిడెన్స్‌కు ముచ్చటపడి ఆయన్ని ఫాలో అయిపోవటం నా ప్రత్యేకత.


"గోధుమ రొట్టెలా..." నసుగుతూ దీర్ఘం తీశాను.

"కొంపదీసి చేయటం రాదా ఏం?" అదిరిపాటుగా అన్నారాయన.

"అబ్బెబ్బే! బ్రహ్మాండంగా వచ్చును. రాకేం?' అన్నాను అదోలా ముఖంపెట్టి.

ఆ మాటైతే అన్నానుగానీ... ఇక్కడో చిక్కుంది. నాదో చిత్రమైన సమస్య. పెళ్ళికి ముందు మేము అప్పుడప్పుడూ చపాతీలు తినేవాళ్ళం. అమ్మ పిండి కలిపి ఉంచితే... చక్కగా ఉండలు చేసి, గుండ్రంగా చపాతీలు చేసేదాన్ని. ఆ చందమామలోనైనా వంకలు వెతకొచ్చు గానీ, నా చపాతీలో ఏ వంకా ఉండదని ఎవరైనా ఒప్పుకు తీరవలసిందే. అమ్మ వాటిని చక్కగా కాల్చేది. సున్నితంగా వేళ్ళతో తుంచుకు తినేయొచ్చు. ఎవరు చేసినా వేళ్ళతోనే కదా తుంచుకు తినేది అంటారేమో... దానికీ ఓ






కథుంది. చేయటంలో ఉన్న నేర్పు కాల్చటంలో కూడా చూపెట్టాలని ఎంతగానో ప్రయత్నించాను. కానీ లాభం లేకపోయింది. నేను కాల్చిన చపాతీలు వేడిగా ఉన్నంతసేపూ అప్పడాల్లా కరకరా నమిలేందుకు, చల్లారిపోతే పళ్ళతో పీక్కుతినేందుకు మాత్రమే వీలయ్యేది. అందుకని అమ్మ నన్ను కాల్చనిచ్చేదే కాదు. పెళ్ళైన ఇన్నేళ్ళలో పూరీలు చేయటమే తప్ప చపాతీలు చేసిన సందర్భాలులేవు. అమ్మవాళ్ళు వచ్చినప్పుడు మాత్రం ఎప్పుడైనా చపాతీలు చేయాల్సివస్తే, యథావిధిగా ఎవరిపాత్ర వాళ్ళు పోషించేవాళ్ళం.

మొత్తానికి మరుసటిరోజు నుంచే పథకం అమలయింది.

పిండి ఎంత కలపాలో అర్థంగాక కొంచెం తికమకపడ్డాను. ఒకసారి నీళ్ళు ఎక్కువైనాయని పిండి కలిపితే, పిండి ఎక్కువయింది. పిండి ఎక్కువయిందని నీళ్ళు కలిపితే... ఇక చెప్పనక్కరలేదు. అలా కలిపీ... కలిపీ బోలెడు పిండి అయింది. మొదట ఆ పిండిని చూసి భయ పడినా... మరుసటిరోజు టిఫిన్‌కింద వాడుకోవచ్చనే మెరుపులాంటి ఆలోచన రాగానే... ఆ భయం కాస్తా ఆనందమై కూర్చుంది.




చేస్తూ కాల్చటం కష్టం కాబట్టి, ముందుగానే రొట్టెలన్నీ చేసిపెట్టుకున్నాను. పిల్లలను డైనింగ్ టేబిల్ ముందే కూర్చోబెట్టి, వేడివేడిగా కాల్చిస్తానని చెప్పాను. వాళ్ళూ సరేనన్నారు.

ఎప్పుడూలేంది రెండు, మూడు, నాలుగు... అంటూ పోటీలుపడి తిన్నారు. తినటం పూర్తయాక, ప్లేట్లు సింకులో పడేసి వస్తుంటే, అప్పుడే స్నానం ముగించుకు వచ్చి, "ఏం పిల్లలూ! తినేశారా?" అడిగారు వాళ్ళ నాన్నారు నవ్వుతూ.

"ఓ... సూపర్‌గా ఉన్నాయి!" అంటూ దీర్ఘం తీశారు పిల్లలు.

"నాక్కూడా పెట్టు, ఆకలి దంచేస్తోంది!" అంటూ వచ్చి కూర్చున్నారు.

"రండి మీక్కూడా వేడివేడిగా కాల్చిస్తుం టాను!" అంటూ రొట్టె కాల్చి, ఆయన ప్లేట్లో ఒక రొట్టె, కూర వడ్డించాను.

"వేడివేడి రొట్టెలు... మా ఆవిడ చేసిన రొట్టెలు...వేళ్ళతోటి తుంచనా రొట్టె ముక్కలు మింగనా...' అంటూ పాట పాడుతూ పళ్ళెంలో చేయి పెట్టారు.

నేను యథావిధిగా రొట్టెలు కాల్చే పనిలో మునిగిపోయాను.


"నాన్నా! తుంచకండి, తుంచకండి. కొరుక్కు తింటే భలే మజాగా ఉంది!" అంటూ స్మైలీ గట్టిగా అరిచింది.

ఆయనకు అర్థంకాక, "కొరకటానికిదేమైనా అప్పడమటే.. రొట్టె..' అంటూ తన చేతిలో నిటారుగా నిలబడి ఉన్న చపాతీని చూసి తికమక పడ్డారు.

"అంతే... అంతే... కొలికెయ్ నాన్నోయ్!' అరిచాడు బాబీ.

అప్రయత్నంగా కొరికి–"బంగారం! ఇవి గోధుమ రొట్టెలా? అప్పడాలా?" అన్నారు తేరుకుని.

"అంటే... నాకు చేయటం వరకే చేతనౌను. చూడండి... ఎంత గుండ్రంగా ఉన్నాయో... అదేం ఖర్మమో కానీ... కాల్చటం మట్టుకు




ఇంత వరకు చేతకాలేదు. కూసంత సర్దుకు పోదురూ..." అన్నాను గారంగా.

"మా తల్లే.. నీకో దండం! తే... ఆ రొట్టెలు నేనే కాలుస్తాను!" అంటూ అట్లకాడ చేత బట్టారు మావారు.

అది మొదలు నేను రోజూ రొట్టెలు చేయటం, మావారు కాల్చటం. నాలుగు రోజులు బాగానే ఉంది. అయిదవరోజు మా అందరికీ మూకుమ్మడిగా విరోచనాలు పట్టు కున్నాయి. హుటాహుటి డాక్టర్ దగ్గరికి పరిగె త్తాము. ఎలాగో ఆ గండం నెమ్మదించింది. ఆ విషయం అమ్మకు, ఆ తర్వాత అమ్మమ్మకూ తెలిసింది. అమ్మమ్మ దగ్గరి నుంచి ఫోన్.


విషయమంతా తెలుసుకుని– "అసలు అలవాటే లేనివాళ్ళు, ఇలా ఒకేసారి ఎడాపెడా తింటే వేడిచేయదా? ఐనా నాకు తెలియక అడుగుతా... ఉత్తరాదివారికి పొట్టలే లేవా? ఇక్కడ అన్నం తినే వాళ్ళలో పొట్టలు లేనివాళ్ళు లేరా?' అంటూ చెడామడా చీవాట్లేసింది.

"నిజమే అమ్మమ్మోయ్! మరి ఇప్పుడెలా?" అన్నాను బెంగగా.

"అంతగా రొట్టెలే తినాలంటే... జొన్న, సజ్జ, రాగి ఇలాంటివి తినండి. నెమ్మదిగా అలవాటు చేసుకోండి. అతి ఎప్పటికైనా అనర్థమే..." అంటూ ఓపక్క చురకలేస్తూనే, గీతోపదేశం చేసింది అమ్మమ్మ.

జొన్నరొట్టెల బాటపట్టాము. జొన్నలు కొని, పిండి పట్టించి, ఓ చక్కటి పర్వదినాన చక్కగా పిండి కలిపి పెట్టాను. అంతవరకూ అంతా సవ్యంగానే జరిగింది. కానీ అసలు కథ అప్పుడే మొదలైంది. ఎంత ప్రయత్నించినా ఒక్క రొట్టె చేయగలిగితే ఒట్టు. రొట్టెలు చేయటంలో ఇంత చేయితిరిగినదాన్నే అయినా కూడా ఏమీ చేయలేక, ఓటమి అంగీకరించి, ఇక లాభం లేదనుకుని, పిండిముద్దను చేత్తో నొక్కి, ఇంచు మించు గారెల సైజులో... కొంచెం తక్కువ మందంతో తీర్చిదిద్ది, ఎంచక్కా కాల్చేశాను. తినేందుకు రమ్మని పిల్లలను కేకేసి, ప్లేట్లలో వడ్డించాను.

"అమ్మా! నాకిష్టమని కుడుములు చేశావా... ఎంత మంచిదానివో!" అంది స్మైలీ మహదా నందపడిపోతూ.



అప్పటికే ఓ ముక్క కొరికి నములుతూ... "ఇందులో ఏదో మిస్సైంది. ఏంటబ్బా! ఆ!... నువ్వు స్వీట్ వేయటం మర్చిపోయావు. సాల్ట్ వేశావు!" అన్నాడు బాబీ పెద్ద ఆరిందాలా.

"అవునా! ఏదీ చూడనీ..." అంటూ స్మైలీ ఓ ముక్క కొరుక్కుని– "అవునమ్మా! కానీ నములుతుంటే వెరైటీగా భలే ఉన్నాయి. ఇదో కొత్తరకం డిషా?" అడిగింది.

ఏం మాట్లాడాలో తెలియక అవునన్నట్లు తలూపాను. ఆఫీసు నుండి లేటుగా వచ్చిన ఆయన గబగబా నాలుగు చెంబులు గుమ్మరించుకుని, ఆకలితో నకనకలాడుతూ వచ్చి భోజనానికి కూర్చున్నారు.


ముందుగా కూర వడ్డించి, ఆ తరువాత నాలుగు గారెల్ని పోలిన జొన్నరొట్టెలను హాట్ ప్యాక్‌లోంచి తీసి కంచంలో వడ్డించాను.

కాసేపు కంచం వంక నావంక కలయజూశారు. కంచంలోని పదార్థం ఏమిటో అర్థంగాక, దాన్ని పట్టుకుని, ముందుకూ వెనక్కూ, పైకీ కిందికీ, చివరికి వాసన కూడా చూసి, రకరకాల పరీక్షలు చేసి, అదేంటో తేలక నా వైపు ప్రశ్నార్థకంగా చూశారు... ఏమిటివి అన్నట్లు.

ధర్మపత్నిని కదా! ఆమాత్రం అర్థం చేసుకోలేనూ... "జొన్నరొట్టెలండీ..." బదులిచ్చాను.

"ఇప్పుడు వీటిని ఎలా తినాలంటావ్?!" అడిగారాయన.

ఆ ప్రశ్న వినగానే అలకతో కూడిన కోపం




ముంచుకొచ్చి... "అంటే!!" అన్నాను.

"అహా! మరేంలేదు... తుంచుకు తినాలా! కొరుక్కు తినాలా అనీ..." దీర్ఘం తీశారాయన.

"నోటితో" అన్నాను రోషపడుతూ.

"అదికాదు బంగారం! నేను, మా ఫ్రెండు ఇంట్లో తిన్న జొన్నరొట్టెలు, చూడటానికి సన్నగా, నాజూగ్గా ఉంటాయి. మరి ఇవేమో మనం వాడే బొంతల్లా ఉంటే... రొట్టెలని ఎలా అనుకోమంటావు చెప్పు!" అన్నారు నన్ను ప్రసన్నం చేసుకునే ప్రయత్నం చేస్తూ.

'జొన్నరొట్టెలు చేయటం... మహా కష్టమండోయ్. అస్సలు ఎంత ప్రయత్నించినా రొట్టెల్లా రాందే. అందుకే విసుగొచ్చి ఇలా చేసి పారేశాను. అయినా మన బొంత బొద్దుగా ఉన్నా, ఎంతో మెత్తగా ఉంటుంది కదా!..." అన్నాను నా తెలివి మొత్తం ఉపయోగిస్తూ.

"మెత్తగా ఉంది కదా అని చూస్తూ చూస్తూ బొంతను తినలేము కదా!" అంటూ తన తెలివిని ప్రయోగించబోయి, నా కోపాన్ని చూసి,


"మొత్తానికి భోజ్యాలను భక్ష్యాల్లా మార్చేశావన్నమాట! బంగారం!... నువ్వింత కష్టపడితే నేను చూడలేను. బయటనుంచి నేనే పట్టుకొస్తాను!" అని మాత్రం చెప్పారు.

నా కష్టాన్ని మెచ్చుకోకపోగా ఇలా వంకలు పెట్టేసరికి, నా కోపం నసాళాన్నంటింది.

"తెచ్చుకోండి తెచ్చుకోండి. నాకే మంచిది. శ్రమ తప్పుతుంది!" అన్నాను ఉడుక్కుంటూ.

నవ్వుకుంటూ వెళ్ళిపోయారాయన.

మరుసటిరోజు నుంచీ రొట్టెలు బయటినుంచే తేవటం మొదలుపెట్టారు. మొదట్లో వేడివేడిగా తింటే బాగానే ఉన్నాయి. కానీ వేడి చల్లారితే మాత్రం అవి కూడా అట్టల్లా నీలుక్కుపోసాగాయి. పిల్లలు వద్దంటే వద్దని మారాం చేయసాగారు. ఇక చేసేదిలేక నేను కూడా అన్నానికే జై కొట్టాను. పట్టువదలని విక్రమార్కుడిలా మావారు మాత్రం తన ఒక్కడికోసమే రొట్టెలు తెచ్చుకోవటం మొదలుపెట్టారు. ఏం చేసినా.. నాకు మాత్రం ఒళ్ళు రాదు, మా వారికి పొట్టపోదు. పాపం! ఆయన అవస్థకి జాలేసి, నేనే ఎలాగైనా జొన్నరొట్టెలు చేయటం నేర్చుకుంటానని ప్రతిజ్ఞ బూనాను. ప్రతిజ్ఞనైతే చాలా ఆవేశంగా చేశాను. కానీ నేర్చుకోవటం




ఎలాగా అని ఆలోచిస్తుంటే...అందరి ఆపద్బాంధవి యూట్యూబ్ గుర్తొచ్చింది. యూట్యూబ్‌లో చూసి బాంబులే తయారు చేసేస్తున్నారు. జొన్నరొట్టెలొక లెఖ్ఖా అనుకుని నా మొబైల్ అందుకున్నాను.

ఓపెన్‌చేసి చూస్తే వేలల్లో వచ్చిపడ్డాయి వీడియోలు. ఏది చూడాలో అర్థంకాక తికమక పడ్డాను. ఒకదానివెంట ఒకటి, దేనికీ పొంతన లేకుండా... అమ్మో! ఒక్క వంటకం చేయటానికి వందల పద్ధతులా... మతిపోయింది నాకు. చివరికి నాకు రొట్టెలు చేయటం రాకపోగా, ఛానెల్స్‌కి వ్యూస్ మాత్రం పెరిగాయి.

రొట్టెలు నేర్చుకునేందుకు మరేదైనా మార్గం ఉందా అని ఆలోచిస్తుండగా... మా వీధి చివర రొట్టెలమ్మే ఆవిడ గుర్తొచ్చింది. పైగా ముందు రోజే మా ఆయన కూడా ఆమె దగ్గరే కొనుక్కొచ్చి, రొట్టెముక్క తుంచిన ప్రతీసారీ 'ఆహా ఓహో' అని పొగిడే కార్యక్రమం పెట్టారు కూడా. ఎంతో ప్రేమగా నేను చేసిన రొట్టెలకు అన్ని వంకలు పెట్టి, ఆవిడెవరో చేసిన రొట్టెలను అంతలా పొగడటం గుర్తొచ్చి, ఆయనపై కోపం, రొట్టెలపై కసీ ఒకేసారి కలిగాయి. నిజంగా ఆమె అంత బాగా చేసిందా? ఎలాగైనాసరే ఆమె దగ్గరే నేర్చుకుని, ఆమెకంటే బాగా చేయాలనే పట్టుదల పెరిగింది.

"పిల్లలూ! నేను నాన్నారికి రొట్టెలు తేవటానికి వెళ్ళొస్తాను. మీరేం భయపడకుండా టీవీ చూసుకోండి... ఈ పక్కనేలే. తొందరగా




వచ్చేస్తా!" అంటూ అన్ని జాగర్తలూ చెప్పాను.

"మాకేం భయంలేదులే! నువ్వెళ్ళిరా!..." అన్నారు తల కూడా తిప్పకుండా.

"నేను బయట డోర్ లాకేసుకువెళ్తున్నా!" అంటూ కేకేసి బయటపడ్డాను.

చుట్టూ ఎవరూలేరని నిర్ధారణచేసుకుని, నెమ్మదిగా వీధిబాట పట్టాను.


"మీకే రొట్టెలు కావాలమ్మా?' అడిగిందామె.

"జొన్న రొట్టెలు!" అన్నాను చుట్టూ కలయజూస్తూ.

"ఎన్ని?" అడిగిందామె.

"నాకు రొట్టెలు కాదు... రొట్టెలు చేయటం కావాలి!" అన్నాను.

"ఏంటమ్మా! మీలాంటి చదూకున్నోళ్ళు పెద్ద పెద్ద ఉద్యోగాలు చేయాలిగానీ ఇలా రొట్టెలు చేయటమేంటి. పైగా నాకొచ్చే ఆదాయం నాకే బొటాబొటిగా సరిపోతోంది. మీకిక్కడ పని ఇయ్యలేనమ్మా!" అంది అమాయకంగా.




"అయ్యయ్యో! నేనిక్కడ పనికోసం రాలేదు. రొట్టెలు చేయటం నేర్చుకోవాలని వచ్చాను!" అన్నాను కంగారుగా.

'ఇవి ఒకటి రెండు రోజుల్లో రావమ్మా! మీకు నేర్పుతూ కూచుంటే నా వ్యాపారం పోతుంది. కావాలంటే నేను చేసేది చూసి నేర్చుకోండి!" అని అంటుండగా...

నలుగురైదుగురు ఒకేసారి వచ్చారు.

ఆమె అందరికీ చకచకా రొట్టెలు చేసి పేపర్లో కట్టి ఇచ్చేస్తోంది. నాకూ ఏదో అర్థమైపోతున్నట్టుగా ఉంది... ఎలాగైనా సరే రొట్టెలు చేసే వెళ్ళాలనే కుతూహలం కదన కుతూహల రాగం పాడుతోంది.

కాసేపు నావైపు చూసి, ఏమనుకుందో గానీ... "మరి మీకు చేయటం రాక నా పిండి పాడుచేస్తేనో?..." అంది సందేహంగా.

అలా ఎలా పాడవుతుంది. నాకన్నీ వచ్చు. ఒకవేళ నువ్వన్నట్టు చేయటంరాక, పిండి పాడైతే... నేను పాడుచేసిన రెండు, నువ్వు చేసే రెండు.. మొత్తం నాలుగింటికీ డబ్బిచ్చేస్తా... సరేనా?' అన్నాను నమ్మకంగా...

సరేనంది. చాలా సంతోషంగా ఆ పిండి తీసుకుని చేద్దామని ప్రయత్నిస్తే... ఒక్కటీ తిన్నగా రావట్లా! అయినా సరే పట్టువిడవ

కుండా చేస్తూనే ఉన్నాను. కాసేపటికి ఎవరో ఇద్దరు రొట్టెల కోసం వచ్చి నిలబడ్డారు. నా వాలకం, నేను రొట్టెలు చేసే వైనంచూసి ఏమనుకున్నారోగానీ... ఒకరిముఖం ఒకరు చూసుకుని, మెల్లగా అక్కడినుంచి వెళ్ళిపోయారు వాళ్ళు.

"అమ్మా... నీకో దండం!... నీ రొట్టెలకో దండం! నువ్వు రొట్టెలునేర్చుకోవటం మాట ఎలాగున్నా, నా వ్యాపారం పోవటం ఖాయం!' అంటూ నాకో దండం పెట్టిందామె.

గభాల్న రెండు రొట్టెలు చేసి, పొట్లం చుట్టి నా చేతిలో ఉంచింది. మరేమీ అడిగే ధైర్యం లేక, ఆమెకు డబ్బిచ్చి, ఉసూరంటూ ఇంటిదారి పట్టాను. పిల్లలూ, నేనూ భోజనాలు కానిచ్చాము. పిల్లలు నిద్రలోకి జారుకున్నారు. ఎప్పుడో పదిన్నరకి మావారు ఇల్లుచేరి... నిక్కుతూ నీల్గుతూ సోఫాలో కూలబడ్డారు.


ఆయనకు మంచినీళ్ళు అందించాను. గటగటా ఆ నీళ్ళన్నీ తాగేసి, తేరిపారా నన్ను చూసి– "నా కోసం రొట్టెలు తెచ్చావా!" అన్నారు పళ్ళు పటపటా నూరుతూ.

" అరెరే... మీకెలా తెలుసండీ?" అడిగాను ఆశ్చర్యంగా.

"ఈ రోజు నుండీ నేను రొట్టె సన్యాసం చేస్తున్నాను" అన్నారు నావైపు గుర్రుగా చూస్తూ.

"అదేవిటండీ?" అన్నాను దిగులుగా.

"ఏవిటా! నా స్నేహితుడు గుర్నాధం నీకు




తెలుసుగా?' అడిగారాయన.

"నాథ్ అన్నయ్య! భలేవారే... నాకెందుకు తెలీదు. ఇంతకీ ఆయనకేమైంది?" అన్నాను.

"ఏమైందా! నీ పైత్య ప్రకోపం చూసి, వాడికి మతి చలించింది!' అన్నారు మావారు.

"అదుగో అదే వద్దంది... మీకూ మీకూ ఏవైనా ఉంటే... మీరూ మీరూ చూసుకోండి. మధ్య నేనేం చేశానూ?" అన్నాను కోపంగా.

"నువ్వు రొట్టెల బండి దగ్గరకు వెళ్ళావా?"

"వెళ్ళాను"

"అక్కడ రొట్టెలూ గట్రా చేశావా?"

"చేశాను!"

"ఇంతకంటే ఇంకేంచేయాలి బంగారం... నేను ఆఫీసు నుండి బయటకు రాగానే, వాడు నా కోసం బయటే కాచుకున్నాడు. నువ్వేమిట్రా ఇక్కడ అంటే... "నువ్వు మాట్లాడకుండా బయలుదేరు!' అంటూ ఓ కాఫీషాపుకు తీసుకెళ్ళి– "నీకేం కష్టమొచ్చిందిరా?... నేనేమన్నా నీకు పరాయివాడినా? నీకు బాల్యమిత్రుడిని కదరా! నాక్కూడా చెప్పవా?" అన్నాడు.

"అదేం లేదురా నాయనా!" అంటే...

"నీకెంత కష్టం వచ్చుండకపోతే... వదినతో రొట్టెల బండి పెట్టిస్తావు!.. అక్కడ అడ్డమైన వాళ్ళు వదినతో పోట్లాడుతుంటే... వాళ్ళకు బదులివ్వలేక, ఆ మాటలుపడలేక వదిన విల విల్లాడుతుంటే, నా గుండె తరుక్కుపోయింది." అంటూ తెగ ఉద్రేకపడుతున్న వాడిని ఆపటానికి నువ్వు రొట్టెలు కొనటానికి వెళ్ళావని ఎంతచెప్పినా నమ్మడే.. చివరికి ఆ రొట్టెలామె మీ దూరపు బంధువనీ చెప్పా! నమ్మలేదు!"


'మరేం చేశారపుడు?' అడిగాను.

"రొట్టెలు చేయటం రాకుండా... బండి పెట్టుకు కూర్చుంటే తిట్టరా మరి! రొట్టెలన్నా నేర్చుకోవాలి! తిట్లన్నా పడాలని!! చెప్పి తిరిగి చూడకుండా వచ్చేశా!" అన్నారాయన.

"అంటే... నేను రొట్టెలమ్ముకుంటున్నానని చెప్పారా!" అన్నాను ఏడుపుముఖం పెట్టి.

"అవును!" అని నొక్కి చెప్పి అక్కడి నుంచి లేచి వెళ్ళిపోయారాయన.

అప్పటినుంచి రొట్టెలజోలికి వెళ్ళటం మానేశాను. ఆయన మాత్రం పట్టువదలని విక్రమార్కునిలా రొట్టెలు తెచ్చుకోవటం, తినటం.



ఎంతైనా ఇంటి వంట ఇంటిదే, బయటి వంట బయటిదే.. అటు ఆరోగ్యం పరంగా, ఇటు సౌకర్యపరంగా కూడా. కొంచెం ఆలస్యమైతే క్యూ పెరుగుతోంది. ముందుగానే తెస్తే గట్టి పడుతున్నాయి. ఆఫీసులో ఆలస్యమైతే రొట్టెలే అయిపోతున్నాయి. పాపం! ఏంజేసినా...మా ఆయన పొట్టా తగ్గలా, బరువు తగ్గి ముల్లు వెనక్కీ పోలా!

అంతలో పిల్లలకు వేసవి సెలవులిచ్చారు.


తాతమ్మ దగ్గరికి పోవలసిందేనని పిల్లలు భీష్మించుకు కూర్చున్నారు... ఎప్పటిలాగే మా వారికి ఆఫీసులో లీవ్ దొరకలా!.. దాంతో మమ్మల్ని అక్కడ దించేసి ఆయన తిరుగు టపాలో వచ్చేశారు. మర్నాడు సాయంత్రం అన్నం వండుదామని కిచెన్‌లోనికి వెళ్ళిన నేను అక్కడి దృశ్యం చూసేసరికి బాధ, ఏడుపూ ఒకేసారి తన్నుకొచ్చాయి. నా అవస్థ చూసిన అమ్మమ్మ– "ఏమైందే?!" అంది.

"నాకెందుకు చెప్పలేదు?" అన్నాను ఏడుపు ఆపుకుంటూ.

"ఇందులో చెప్పటానికి ఏముంది? అయినా నువ్వు నన్ను ఎన్నడైనా మాటవరసకైనా అడిగావా?" అన్నదామె సూటిగా.

"నాదే తప్పులే..కానీ.. ఎలా..?" అన్నాను.

"ఎలా ఏముంది? మేం చిన్నప్పుడు మా పొలాల్లో ఎరువు వేయించటానికి, పశువులను తోలుకొని లంబాడీలు వచ్చేవాళ్ళు... అలా వచ్చినవాళ్ళు, పని పూర్తయ్యేదాకా అక్కడే, మా





ఊళ్ళోనే డేరాలు వేసుకుని ఉండేవారు... అప్పుడు వాళ్ళల్లో ఓ పెద్దావిడ ఈ పని చేసేది. ఆమె దగ్గరే నేర్చుకున్నా. మీరెలాగూ రొట్టెలే తింటున్నారుగా... నాకేమాత్రం గుర్తుందో అని పరీక్ష చేస్తున్నా! అదీ కథ!" అంటూ చెప్పుకొచ్చింది అమ్మమ్మ.

ఆ కథంతా విని "వా:..." అంటూ కుళాయి విప్పాను.

"ఎందుకే ఆ ఏడుపు? ఇప్పుడేమైంది?" అడిగింది అమ్మమ్మ కంగారుపడుతూ.

"జరిగిందంతా తెలిస్తే నువ్విలా అనవు!" అంటూ కథంతా చెప్పుకొచ్చాను.

"ఓసినీ అసాధ్యం గూలా!... ఒక్క రొట్టె కోసమా ఇంత గ్రంథం నడిపావు!... మరేం ఫర్వాలేదులే. అయిందేదో అయింది. మీ ఆయన వచ్చేసరికి జొన్న, సజ్జ, రాగి... ఇలా ఎన్ని రకాల రొట్టెలున్నాయో, వాటిల్లో ఏమేం నంజుకుతింటే బాగుంటాయో, జొన్న, రాగి సంకటులు ఎలా చేయాలో ఒకటేమిటి, అన్నింటిలో నీకు నేను తర్ఫీదునిస్తాగా!' అంది అమ్మమ్మ అభయమిస్తూ.




ఆ క్షణం ఆమె నాకు అమ్మమ్మలా కాదు. చదువురాని కాళిదాసుకు మహాజ్ఞానాన్ని ప్రసాదించిన కాళికాదేవిలా, కురుక్షేత్ర సంగ్రామంలో భీరువుగా అస్త్రసన్యాసం చేయబోతున్న అర్జునుడికి అభయమిచ్చి నడిపించిన శ్రీకృష్ణ పరమాత్మునిలా నాకనిపించింది... దాంతో కొండంత ధైర్యం వచ్చిన నేను, అమ్మమ్మ చేస్తున్న, కాదు కాదు... చేసి కాలుస్తున్న రొట్టెలలో ఒక దానిని అందుకుని... విలాసంగా పట్టుకొని–"ఓసీ రొట్టాధమా! ఇన్నాళ్ళూ నన్నెంతగా ఏడిపించావు! ఇక నా నుంచి నువ్వూ, మా వారూ ఏ ఒక్కరూ తప్పించుకోలేరు. నా పాకశాస్త్ర ప్రావీణ్యాన్నంతా జోడించి, నిన్ను లొంగ దీసి, అలా అలా వేళ్ళతో సున్నితంగా తుంచి, ఆ 'రొట్టెముక్క'ను మావారికి నా స్వహస్తాలతో అందించి, 'శహభాష్ బంగారం' అని అనిపించుకోలేకపోయానో... నేను భామ... కాదు కాదు... రుక్మిణీభామనే కాదు!" అంటూ,

"నా శపథం నెరవేరాలని నన్ను దీవించు మాతా మహీ! "అన్నాను వంగుతూ!

ఫక్కున నవ్వేసింది మా అమ్మమ్మ.




## గిరీశం కార్టూన్లు- కమల్ కార్టూన్లు

గిరీశం, కన్యాశుల్కం నాటకంలో గురజాడ అప్పారావు గారు సృష్టించిన కాల్పనిక పాత్ర. అటు తెలుగు సాహితీ రంగంలోనే కాకుండా... ఇటు తెలుగు నాటక రంగంలోనూ సుస్థిర స్థానం సంపాదించుకున్న పాత్ర.


ఇప్పుడు కార్టూనిస్టు కమల్‌గారి ఆలోచనలలో కార్టూన్ కేరెక్టర్‌గా రూపుదిద్దుకుంది.

కన్యాశుల్కం నాటకంలో గిరీశంది హీరో పాత్ర కాదుగాని ప్రాధాన్యత వున్న పాత్రే. అడపా దడపా వచ్చీరాని ఇంగ్లీష్ ముక్కలు మాట్లాడుతూ... కళాపోషణ, సంఘ సంస్కరణ అంటూ లెక్చర్లు ఇస్తూ, హాస్యాన్ని పండించే కేరెక్టర్ అది. అలాంటి కేరెక్టర్‌తో కార్టూన్లు గీయొచ్చని ఆలోచన చేసిన కార్టూనిస్టులు వుండవచ్చు గాని, దాన్ని ఆచరణలో చూపి అనేక కార్టూన్లు గీసి పుస్తకంగా అచ్చెయ్యడం కమల్ గారికి మాత్రమే దక్కిన అవకాశం, అదృష్టం కూడా.

గతంలోనే ఒక కార్టూన్ సంకలనాన్ని ప్రచురించిన కమల్ గారు ఇప్పుడు 'గిరీశం' మీద గీసిన నూరుకు పైగా కార్టూన్ల తో మరో కార్టూన్ల సంకలనం తేవడం అభినందనీయం!

గిరీశం కేరెక్టర్‌ను కార్టూన్ బొమ్మగా చాలా చక్కగా మలచుకున్నారు. కన్యాశుల్కం నాటకానికి తెలుగు సాహిత్యంలో ఒక ప్రత్యేక స్థానమున్నట్టే, కమల్ 'గిరీశం కార్టూన్ల సంకలనం కూడా తెలుగు కార్టూన్ రంగంలో ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకోగలదు అనడంలో సందేహంలేదు. ఈ మంచి పుస్తకం పాఠకులను అలరిస్తుందనడంలో ఏమాత్రం సందేహం లేదు!

**-కళాసాగర్ యల్లపు**




వెల: **రూ.260/-** (కార్టూనిస్టులకు **రూ.200/-** మాత్రమే)
**వివరాలకు: కమల్- 9705162419**

---

## మానవీయతను పరిమళింపజేసే కథలు- జక్కదొన

చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలంలోని ఒక మారుమూల గ్రామం జక్కదొన. ప్రముఖ సాహితీవేత్త పులికంటి కృష్ణారెడ్డి గారు పుట్టి పెరిగిన ఊరు కూడా ఇదే కావడం జక్కదొనకు ఉన్న మరో ప్రత్యేకత.

ఈ పుస్తకంలో మొత్తం 21 కథలున్నాయి. కథలన్నీ చిత్తూరు, తిరుపతి చుట్టుపక్కల ప్రాంతాల సంస్కృతిని పరిమళింపజేసే కథలే.

రచయిత కృష్ణస్వామి రాజుగారి కథలోని పాత్రలన్నీ మానవీయ విలువలు కలిగి ఉంటాయి. ఏవైనా పాత్రలు అందుకు విరుద్ధంగా ఉన్నా... కథ పూర్తయ్యేటప్పటికి ఆ పాత్రలు పరివర్తన చెందుతాయి. పుస్తకంలోని కథలకు చిత్తూరు జిల్లా మాండలిక సొగసులు అద్దినప్పటికీ, పాఠకుడు కథలను చకచకా చదివేలా, పల్లె అందాలను ఆస్వాదించేలా సరళంగా సాగిపోతాయి.




సాధారణంగా కథకులు కథావస్తువును ఎంచుకొన్న తర్వాత బలమైన పాత్రలను సృష్టిస్తారు. ఆ పాత్రల చుట్టూ సంఘటనలు అల్లుతారు. కానీ, రాజుగారు తన రచనల్లో పాత్రలకు మించి, సంఘటనలకు ప్రాధాన్యతనివ్వడం ఆశ్చర్యపరుస్తుంది. సంఘటనల కోసం మాత్రమే పాత్రలను వాడుకొంటారు. అయినప్పటికీ కథ చదువుతున్న పాఠకుడికి పాత్రల పట్ల గురి, కథ పట్ల స్పష్టత ఉంటుంది. కథలో వారు రాసే సామెతలు, జాతీయాలు, నుడికారాలు కథలకు అదనపు ఆకర్షణ. కృష్ణస్వామిరాజు గారు మరిన్ని మంచి కథలు రాయాలని, తెలుగు సాహిత్యంలో వారి కథలు చిరస్థాయిగా నిలచిపోవాలని మనస్ఫూర్తిగా కోరుకుందాం.

**-పేట యుగంధర్.**

**జక్కదొన -ఆర్.సి.కృష్ణస్వామిరాజు**
**ప్రచురణ:** అచ్చంగా తెలుగు, పేజీలు: 170 ✦ **వెల:** 140/-
**ప్రతులకు:** 9393662821.



**పుస్తకావిష్కరణ**




మన తెలుగు కార్టూనిస్టుల వైభవాన్ని
పరిచయం చేస్తున్న శీర్షిక! 11

## మోహన్ కుమార్

నేను పుట్టినది మహబూబ్‌నగర్‌లో. నేను తొమ్మిదవ తరగతి చదివేటప్పుడు మా నాన్నగారికి ఉద్యోగరీత్యా హైదరాబాద్‌కు ట్రాన్స్‌ఫర్ కావడంతో ఇక్కడికొచ్చి, ఇక్కడే సెటిల్ అయ్యాము.

చదివింది ఎమ్.ఎస్.సి. (కెమిస్ట్రీ). ఒక ఫార్మా కంపెనీలో కెమిస్ట్‌గా పని చేసి ఇటీవలే రిటైర్‌మెంట్ తీసుకున్నాను.

చిన్నప్పుడు ఇంట్లో ఆంధ్రపత్రిక, ఇలస్ట్రేటెడ్ వీక్లీ తెప్పించేవారు. వాటిలోని కార్టూన్లు, కామిక్స్ చూసి ప్రభావితం చెంది, అలానే వేయటానికి ప్రయత్నించేవాడిని.

ముఖ్యంగా జయదేవ్ గారి కార్టూన్లు, Hank Kecham కామిక్స్ బాగా నచ్చేవి.

మనమూ కార్టూన్లు ప్రయత్నిద్దాం అనుకొని, నేనూ, మా అన్నయ్య అప్పుడే ప్రారంభమైన ఆంధ్రభూమికి కార్టూన్లు (కలిసి వేసినవి, విడివిడిగా కాదు) పంపిస్తే రెండు, మూడుసార్లు తిరిగి వచ్చి, చివరికి ఒకే సంచికలో 3 కార్టూన్లు పబ్లిష్ కావటం సంతోషం కలిగించింది. తర్వాత మా అన్నయ్య Maku పేరుతో... నేను Moni పేరుతో కార్టూన్లు వేయటం ప్రారంభించాము.


అలా Moni పేరుతో వివిధ పత్రికలలో డిగ్రీ మూడవ సంవత్సరం వరకూ వేసాను.


తర్వాత ఉద్యోగరీత్యా పని ఒత్తిడితో దాదాపు 30 సంవత్సరాలు కార్టూన్లు వేయటం మానేసాను.


అయితే ఒక శుభ ముహూర్తంలో ఎందుకో మళ్ళీ వేయాలనిపించి 2014 నుంచి Moni పేరుతో కాకుండా **మోహన్ కుమార్** పేరుతో సెకెండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేసాను.


ఇంతవరకూ వందల సంఖ్యల్లోనే వేసాను.


ప్రస్తుతానికి రిటైర్‌మెంట్‌లో ఉన్నాను కాబట్టి, కార్టూన్లు ఇంకా ఇంప్రూవ్ చేసి మంచి మంచి ఐడియాలతో వేయాలనేది నా కోరిక.


















దొరికిన పర్సు అడ్రస్ వెతికి మరీ
ఇచ్చొచ్చావా!?.. నా కడుపున చెడబుట్టావు కదరా వెధవా!?
గజదొంగ గంగన్న
MOHAN KUMAR


అటూ ఇటూ కాకుండా
మిడిల్ క్లాసోడ్ని చేసొచ్చావేమిటే!?..
ఏం సుఖ పెడ్తాడనే!!??..
MOHAN KUMAR



MOHAN KUMAR


నిత్య అన్నదానము
ఈ ఫెసిలిటీ వచ్చినప్పట్నించీ
జాబ్ గురించి వెతుకులాట
మానుకున్నా!!
MOHAN KUMAR


మా యజమాని పంపించారు...
వారం రోజుల్నుంచీ చికెన్ తింటం లేదంట...
ప్రాబ్లం ఏమిటో కనుక్కోమన్నారు...
వెటరినరీ డాక్టరు
MOHAN KUMAR


దసరాకి గాంధీ వేషం కాదు..
మేముండేదే ఇలా..
MOHAN KUMAR


మా ఆయన బాత్‌రూంలో
సిగరెట్లు తాగుతున్నారేమోనని
డౌటొచ్చి CC కెమెరా
పెట్టించా...
TOILET
MOHAN KUMAR


సెల్‌ఫోన్ పడిపోయిందంట..
వెతుకుతున్నాడు పాపం!!...
MOHAN KUMAR

# Reverse Gear
# వెనక్కి వెళ్ళే కథలు

గంగాధర్ వడ్లమన్నాటి- 9908445969


## రెండో ఆఖరి కోరిక

**"వౌడు వెనక్కి వెళ్తానంటున్నాడు... వెళ్ళనివ్వండి! నా మాట విని వాడినేవీ అడక్కండి, వాడిప్పుడు పాలు తాగే బాలుడనుకుంటున్నారా?... వాడి గోల్ ఏవిటో వాడికి తెలుసు. కనుక వాడి గోల మీరు పట్టించుకోకండి! వాడి భవిష్యత్తు వాడి ఇష్టం... ఎలా రాసిపెట్టి ఉంటే అలా జరుగుతుంది. మీరు వాడిని కంట్రోల్ చేయకండి. ఏదీ తెగే వరకూ లాగడం మంచిది కాదండీ..." బిక్కు బిక్కుమంటూ చిన్న స్వరంతో చెప్పింది లక్ష్మమ్మ.**

"వాడిని ఏది అడగాలో, ఏది అడక్కూడదో నాకు బాగా తెలుసు. వాడి భవిష్యత్తు వాడే సొంత చేతులతో నాశనం చేసుకుంటానంటే, అద్దె మనిషిలా చూస్తూ ఊరుకోవాలా?... తండ్రిగా నేనాపని చేయలేను. వాడు ఏం చేస్తే బావుంటుందో... వాడికంటే నాకే బాగా తెలుసు." శేఖరం అంటుండగానే... హాల్లోకి వచ్చి సోఫాలో కూర్చుని, టీపాయ్ మీద ఉన్న పత్రిక తీసుకుని తిరగేస్తున్నాడు మధు.

లక్ష్మమ్మ మరోసారి శేఖరం వంక చూస్తూ, వద్దండీ అన్నట్టు సైగ చేసింది.

ఆమె సైగలు ఏమాత్రం పట్టించుకోకుండా, "నీకు మతి గాని పోయిందా ఏవిట్రా మధూ! మెడిసిన్‌లో ఒక డిగ్రీ పూర్తయ్యాక, మళ్ళీ వెనక్కి వెళ్ళి ఇంకో డిగ్రీ పూర్తి చేస్తానంటున్నావట. పెద్దముండా వాడిని ఇలా చెప్తున్నా, నువ్ చిన్న తనంతో ఆలోచిస్తున్నావనిపిస్తోంది నాకు... అయినా... ఎవరైనా ఎం.బి.బి.ఎస్. చేసిన తర్వాత ఏ ఎం.డి.లోనో స్పెషలైజేషన్ చేసి పెద్ద డాక్టర్‌గా నలుగురి చేతా గుర్తింప బడాలనుకుంటారు, కానీ నువ్వు ఏవిట్రా మళ్ళీ వెనక్కి వెళ్ళిపోయి,మళ్ళీ డిగ్రీ చదువుతాననీ... అదికూడా ఆడవాళ్లు ఇష్టపడే వంటల సబ్జెక్ట్‌లో హొటల్ మేనేజ్మెంట్ చేస్తానంటున్నావ్! ఏమన్నా పైత్యవా! నీ ఈ వ్యర్థ ఆలోచన నాకేవీ అర్థం కావడం లేదురా! పైగా నీకు పేమెంట్ సీటుకి డబ్బు కట్టడానిగ్గాను, నేను పేవ్‌మెంట్ మీదకి వచ్చేసాను... ఎప్పటినుంచో మన తాత ముత్తాతల నాటి నుంచీ వస్తున్న పొలం అమ్మేసాను, తాతలనాటి స్థలం అమ్మేశాను. ఆఖరికి మీ అమ్మ వద్దని పట్టుబట్టినా, ఆమె బంగారం తాకట్టు పెట్టేసాను. అలా ఆర్థికంగా కూలి పోయినా, డాక్టరయ్యావన్న హార్థిక తృప్తితో కోలుకున్నాను. నిన్ను ఎం.బి.బి.ఎస్ డాక్టర్‌గా చూసి మురిసి ముద్దయిపోయాను... కానీ ఇప్పుడు నువ్విలా అంటున్నావ్?! ఇదేవన్నా బావుందా చెప్పు?" అడిగాడు శేఖరం కొడుకు గడ్డం పట్టుకుంటూ.




"ఏమో నాన్నా! నాకు అవన్నీ తెలీదు. నువ్ గడ్డం కాదు, నా పీక పట్టుకున్నా సరే... నా నిర్ణయం మార్చుకోలేను. ఎందుకంటే, హోటల్ మేనేజ్మెంట్ కోర్సులో డిగ్రీ పూర్తి చేసి, ఏదైనా ఫైవ్‌స్టార్ హోటల్లో షెఫ్‌గా చేరాలని నాకు చిన్నప్పటి నుంచీ ఆశ. చిన్నప్పుడు ఎప్పుడూ, అమ్మతో పాటు వంటగదిలోకి దూరి, అమ్మకి ఇష్టంగా వంటలలో సాయం చేసేవాడిని... కొంచెం పెద్దయ్యాక, ఎవరైనా ఏదైనా డిష్ గురించి చెబితే, విని ఉండిపోకుండా, ఆ ఫుడ్ ఐటమ్‌ని వండుకుని తినడం అలవాటయింది. అలా మొక్కలా అనుకోకుండా నాలో కలిగిన ఆ ఆశక్తి, నా వయసుతో పాటే పెరిగి పెరిగి ఇప్పుడు మానులా మారిపోయింది. ఎంతలా అంటే, బ్రషింగ్, బాతింగ్ లాగా కుకింగ్ కూడా ఇంచుమించు దినచర్యలా తయారయింది... అందుకే చిన్నప్పుడే షెఫ్ అవ్వాలని నిర్ణయం తీసుకున్నాను. అమ్మతో కూడా చెప్పాను. నిన్ను కూడా ఒప్పించాలనుకున్నాను... కానీ నీ మాటలు విన్నాక, నిన్ను ఒప్పించి నొప్పించడం కన్నా, అర్థం చేసుకుని... నీ తృప్తి కోసం ఈ యం.బి.బి.ఎస్ పూర్తి చేయడం మిన్ననుకుని,

పూర్తి చేసాను... కానీ నీ కోసం నా మిగతా జీవితం అంతా ఇష్టం లేని ప్రొఫెషన్‌లో గడప లేను నాన్న... అందుకే వెనక్కి వెళ్ళి నా తృప్తి కోసం నాకిష్టమైన డ్రీమ్ కోర్సు కంప్లీట్ చేసుకో వాలనుకుంటున్నాను." నేల చూపులు చూస్తూ, చేతులు నలుపుకుంటూ చెప్పాడు.


ఆ మాటలు వింటూనే... మొహాన్ని చిట్లిం చేస్తూ, సోఫాలో స్ప్రింగు గుచ్చుకున్నట్టు... రయ్యిమని పైకి లేచి నుంచుని–

"డ్రీమా?! పేస్ క్రీమా!!? తెల్ల కోటేసుకుని క్రిటికల్ కేర్‌లోకి వెళ్ళమంటే... తాలింపు డబ్బాతో కిచెన్‌లోకి వెళ్తానంటావా?!... సూదీ, సిరంజ్ పట్టుకోవాల్సిన చేతితో, స్పూను, గరిట పట్టు కుంటానంటావా? థర్మామీటర్ పట్టుకుని, పేషెంట్ల నోట్లో పెట్టి జ్వరం చూడాల్సిన నువ్వు ఉప్పు, కారం సరిపోయిందా లేదా అని, ఊర్పు చేతిలో వేసుకుని నాకుతా నంటున్నావా? హాయిగా కాలు మీద కాలు వేసుకుని, తెల్ల కోటే సుకొని, కుర్చీలో కూర్చుని దర్జాగా అందరి చేతా నమస్కారాలు పెట్టించుకుని దేవుడి తర్వాత దేవుడు అనిపించుకోరా అని మొత్తు కుంటుంటే, కాళ్ళు పీకేలా ఆ కిచెన్లో నుంచుని, పొయ్యి,పెనం,నూనె మధ్య, పోపు వేపుళ్ళ మధ్య మాడి మసైపోతానంటున్నావ్!... ఎలా వచ్చిందిరా నీకు ఈ ఆశక్తి!..." అని పళ్ళు కొరుకుతూ...

ఓ సారి లక్ష్మమ్మ వైపుకి బుర్ర తిప్పి– "ఏవే ఇదంతా నీ పనేనా!" అడిగాడు భార్యని గట్టిగా.

ఆమె ఎటు పోయి ఎటు వస్తుందో అనే భయంతో గజగజా వణికిపోతూ–

"ఏవిటండీ మధ్యలో నన్నంటారు! వాడికి కుకింగ్ అంటే చిన్నప్పటి నుంచీ ఇష్టం. మీరు అడిగారు వాడు చెప్పాడు. మధ్యలో నేనేం



చేశాను...

అయినా మధూ!... ఇదేమైనా నీకు న్యాయం గా ఉందా చెప్పు? ఇంత దూరం వచ్చేసావు... మళ్ళీ వెనక్కి వెళ్ళిపోతానంటే ఇన్నాళ్ళూ మీ నాన్న పెట్టిన ఖర్చు, నువ్ పడ్డ శ్రమా, ఇదంతా వృధా అయిపోదూ... కనుక మరొకసారి ఆలో చించరా! అయినా నాన్న అంత కష్టపడి చది విస్తే చదివావు... ఇదేదో అప్పుడే వద్దు అని గట్టిగా చెప్పేయలేక పోయావా?... ఇంత దూరం నువ్వు ఎందుకు వచ్చినట్టు! మీ నాన్నని ఎందుకు ఆశపెట్టి నట్టు!" అడిగిందామె.

ఆమె మాటలకు మధు కాస్త కోపంగా–

"అమ్మా నిజం చెప్పే తీరాలంటావా!... అయితే విను!...

నాన్నకు అప్పుడు ప్రోస్టేట్ క్యాన్సర్ ఉందని డాక్టర్లు తేల్చి చెప్పారు... అయితే ఎంత కాలం ఏమిటి అనేది ఎవరి చేతు ల్లోనూ ఉండదని కూడా చెప్పారు... నాన్న అప్పుడు నన్ను ఎమోషనల్ బ్లాక్ మెయిల్ చేసాడు...

నేను ఎంతకాలం బ్రతుకుతానో తెలియదు. కానీ ఇది నా చివరి కోరిక నుకో, ఈ ఎం.బి.బి.ఎస్. పూర్తి చెయ్యి అని అన్నారు..." ఒక్క క్షణం ఆగి...

"దాంతో, నా కాళ్ళని ఎవరో తాళ్ళ తో కట్టేసినట్టు ఆగిపోయాను. ఆయన మాట నీటి మూట కాకుండా... ఈ ఎం.బి.బి.ఎస్ పూర్తి చేశాను...

ఒక మనిషికి రెండు చివరి కోరికలు ఉండవు కదమ్మా... అందుకనే మళ్ళీ నాన్న రెండోమారు అడుగుతాడని ఊహించలేక పోయాను!" చెప్పి...

లోపలికి వెళ్ళిపోయాడు. శేఖరం మొహం తెల్లగా పాలిపోయింది.

## కార్టూనిస్ట్ భానుకు సేవాస్ శ్రీ ఎక్స్‌లెన్సీ అవార్డు

హాస్యానందం అభినందనలు Congratulations

ప్రముఖ కార్టూనిస్టు భాను (శ్రీ గుండ్రెడ్డి భాస్కరరావు) గారికి, బొబ్బిలికి చెందిన **అభిమాని ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ** సేవా శ్రీ ఎక్స్‌లెన్సీ అవార్డు, ది.06. 10.2024 ప్రదానం చేసింది.




ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా బొబ్బిలి డి.ఎస్.పి శ్రీ పి శ్రీనివాసరావు, ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు శ్రీ కేవీ అప్పారావు, సి ఐ సతీష్ కుమార్, రోటరీ క్లబ్ అధినేత శ్రీ జె.సి.రాజు, ఆ సంస్థ ప్రతినిధి శ్రీ రాజగోపాల్ ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

భాను అన్న కలం పేరుతో కార్టూన్ వేస్తూ సుమారు నాలుగు వేలకు పైగా అన్ని పత్రికల్లో కార్టూన్లు వేశారు.అనేక బహుమతులు, అవార్డులు అందుకున్నారు. తన కార్టూన్లతో సామాజిక చైతన్యం కలిగిస్తున్నందుకు గాను ఈ అవార్డును ప్రదానం చేసినట్లు సంస్థ ప్రతినిధి శ్రీరాజ గోపాల్ చెప్పారు. ఈ అవార్డు భానుకు రావడం పట్ల స్థానిక రచయితలు, కవులు అభినందనలు తెలిపారు.

# కిలకిలలు గలగలలు

నల్లబాటి రాఘవేంద్రరావు
9966212386

**రూపలావణ్యకు ముప్ఫై సంవత్సరాలు... నాలుగేళ్ల క్రితం పెళ్లయింది. భర్త భజరంగరావు. ఉండేది బెంగుళూరులో. ఆవిడగారు ఇప్పుడు సంక్రాంతి పండుగకు పుట్టింటికి కాకినాడ బయలుదేరింది. చేతిలో సూట్‌కేస్ ఉంది. సంకలో పిల్లలు లేరు అనడానికి వీలు లేదు ఒక పిల్లకాయ ఆమె కడుపులో ఉంది.**

భజరంగరావుది పెద్ద కార్ల వ్యాపారం... అంటే పెద్ద పెద్ద కార్లు కాదు మామూలు చిన్న కారులే కానీ వ్యాపారం పెద్దదన్నమాట. అందుకనే అతగాడు భార్య వెంట కాకినాడ రావడానికి కుదరలేదు. డ్రైవర్లు కూడా సమయానికి ఖాళీగా లేక పోవడంతో... ట్రైన్ ఎక్కి ఏసి కంపార్ట్‌మెంట్లో కాకినాడ వచ్చేసింది.


కాకినాడ స్టేషన్లో ట్రైన్ దిగింది రూపలావణ్య. తండ్రి అహోబిలేశ్వరం ఆమెను రిసీవ్ చేసుకుని ఇంటికి తీసుకొని వెళ్ళాడు.

భోజనాలయ్యాక కూతురిని మార్కెటుకి తీసుకుని వెళ్లి సంక్రాం తికి బహుమతిగా తన ముద్దుల కూతురుకి కావలసింది కొనాలి అనుకున్నాడు. అదే మాట చెప్పి మార్కెట్‌కు వెళ్లడానికి కూతుర్ని తొందర పెట్టాడు.

"నాన్న! నాకు బహుమతులు మూడు సంవత్సరాల నుండి ఇస్తున్నావు కదా!అయినా మాకే బోల్డంత డబ్బు ఉంది నీ బహుమతులు వద్దు." అంది.

ఆ మాటతో అహోబిలేశ్వరం ఆయన భార్య మహంకాళమ్మ కంగారుపడి... కూతురుని బ్రతిమలాడారు.

అప్పుడు రూపలావణ్య తల్లి తండ్రి మధ్యన కూర్చుని– "నాన్న! బాల్యంలో నా వయసు రెండవ సంవత్సరం ముగిసిన వెంటనే నన్ను ఇంగ్లీషు చదువులో పెట్టారు.కొన్నాళ్లు హాస్టల్లో పడేశారు. అప్పటి నుండి చిన్ని చిన్ని ఆనందాలు నాకు తీరలేదు. ఇప్పుడు ఆ సరదాలు తీర్చుకోవాలి అనుకుంటున్నాను... అంటే సంక్రాంతికి నేను ఇక్కడ ఉండే ఈ నెల రోజులలో అవన్నీ ఇప్పుడు తీర్చుకోవాలని వచ్చాను. అదే మీరు పెద్ద బహుమతి ఇచ్చినంత ఆనందం నాకు కలుగుతుంది. నా కడుపులో బిడ్డ కూడా పరమానంద పడిపోతుంది...




అదేమిటంటే జాగ్రత్తగా వినండి.. లాల పోసుకో అమ్మ..అంటూ లేచిన వెంటనే నా బెడ్ రూమ్‌లో నా దగ్గరికి వచ్చి అమ్మ అనాలి. నేను మారాం చేస్తాను బతిమలాడాలి... పరిగెత్తుకుని దొడ్లోకి వెళ్ళిపోతాను. నన్ను ఎలాగోలా జాగ్రత్తగా ఎత్తుకొని తీసుకొచ్చి, అమ్మ ఆ పని పూర్తి చెయ్యాలి... ఇలా నేను ఇంటి దగ్గర ఉన్నన్నాళ్లు ప్రతిరోజు చేయాలి.

అమ్మ నా బెడ్‌రూమ్‌లో నాకు బట్టలు వేశాక కూడా ఇది... అది... అంటూ చాలా గొడవ పెడతాను. అమ్మ విసుక్కోకుండా బ్రతమలాడి నాకు ఏ బట్టలు కావాలంటే... ఆ బట్టలు వేయాలి. ఆ రకంగా మిగిలిన సరదాలు కూడా తీర్చాలి...

ఇక నాన్న... నీ విషయం ఏమిటి అంటే.. నువ్వు నాకు టిఫిన్ తినిపించాలి... పాలు తాగించాలి. నిన్ను చాలా బాగా ఏడిపిస్తాను. ఉప్మా పెడితే ఇడ్లీ పెట్టమంటాను, ఇడ్లీ పెడితే పూరి పెట్టమంటాను. అది పెట్టాక అది వద్దు బువ్వ పెట్టు అంటాను. మంచినీళ్ల గ్లాసు కాలితో తంతాను... పాలు నేల మీద ఒంపుతాను... ఇవన్నీ అప్పుడు చేయాలనుకున్న నా సరదా అల్లరి పనులు... ఇప్పుడు ఇవన్నీ చేసి ఆ ఆనందానుభవం పొందాలి అని ఉంది.. మీరు భరించాలి. నిజం చెప్పండి నా రెండవ సంవత్సర వయసులో నా ముద్దు మురిపాలు తీర్చుకోకుండానే మీరు కూడా బ్రతికేశారు కదా!.. ఏం చేస్తారు అప్పటి చదువుల సమాజ విధానాన్ని బట్టి నన్ను దూరంగా పెట్టవలసి వచ్చింది మీరు..." అంటూ ఇంకా ఇంకా చెప్తుంది రూపలావణ్య.

అహోబిలేశ్వరం,మహంకాళమ్మ దంపతులు గుడ్లు పెద్దవి చేసుకొని వింటున్నారు. కానీ వాళ్లకు ఆ విషయం తెలియదు. ఒకరి బుర్రతో మరొకరి బుర్ర బాదుకున్నారు కానీ... అలా బాదుకున్న సంగతి కూడా వాళ్లకు అర్థం కాలేదు. పెరిగిపోయి ఉన్న గోళ్ళతో ఒకరి కాళ్లు చేతులు మరొకరు గోక్కున్నారు... అది

కూడా వాళ్ళు అవగాహన చేసుకోలేనంత మాయా ప్రపంచంలో పడి పోయినట్టు ఉన్నారు. వాళ్ళిద్దరూ ఇంచుమించు స్పృహ కోల్పోయినట్టు అయిపోయినా వాళ్ళ కర్ణభేరికి తమ ఒక్కగానొక్క కూతురు  రూప లావణ్య చెబుతున్నవి అన్నీ చాలా స్పష్టంగా వినపడుతున్నాయి.

రూపలావణ్య బాల్యంలో తీర్చుకోలేకపోయిన తన కోరికలు ఇంకా చెప్పుకుపోతుంది....

"నాన్న ఆ తర్వాత నువ్వు నన్ను ఆచి వెళ్దాం రా అమ్మ అని తీసుకు వెళ్లాలి. నాకు పప్పులు కొని పెడతావా అని అడుగుతాను... నువ్వు కొనాలి. అమ్మవారి గుడి దగ్గర తీర్థంలో రంగులరాట్నం ఎక్కించి అక్కడే పీచు మిఠాయి కూడా కొనిపెట్టి దారి పొడుక్కి నేను అది తింటుంటే నా నోట్లో నుంచి చొంగలు కారి నా బట్టల మీద పడితే నువ్వు నన్ను వీపు మీద కొట్టాలి... నేను ఏడుస్తాను! నువ్వు నన్ను బ్రతిమలాడి వెనక్కి తీసుకెళ్లి ఇంకొక పీచుమిఠాయి కొనిపెట్టాలి ఏమి అనకూడదు. ఈ సరదా తీర్చుకోవాలని ఇరవైఎనిమిదేళ్ల నుంచి ఎదురు చూస్తున్నాను.

ఇంటికి వచ్చాక 'బువ్వ పెడతాను రా అమ్మ' అని అమ్మ నన్ను అనాలి. అదిగో అక్కడే అసలు కథ మొదలవుతుంది. మీరిద్దరూ అన్నం తినిపించడానికి ప్రయత్నిస్తే నేను మిమ్మల్నిద్దరినీ విసిగిస్తాను. ఒక ముద్ద కూడా తినను. మీరిద్దరూ నాకు ఫోటోలో చందమామను చూపించి బ్రతిమలాడుతూ చంద మామ రావే అన్న పాట పాడుతూ ముద్ద తినిపించాలి. ఇంత పెద్దదానితో ఆటలు, పాటలు ఏమిటి అని సంకోచించకూడదు.  సిగ్గు పడకూడదు. మొత్తానికి ఆ ఆనందం అలా పూర్తవుతుంది.


ఇలాంటివన్నీ ప్రతిరోజు ఒక సీరియల్‌లా అలా అలా జరుగుతూ ఉండాలి." ఇంకా చెప్పటం ఏ మాత్రం ఆపలేదు రూపలావణ్య.

అహోబిలేశ్వరం కాస్త స్పృహలోకి వచ్చి సెల్‌ఫోన్‌లో ఏదో నెంబర్ నొక్కాడు. ఐదు నిమిషాల్లో మంత్రేశ్వరరావు వచ్చాడు.

రూపలావణ్య చుట్టూ మూడు నిమ్మకాయలు పెట్టి వేప మండతో దిష్టి తీశాడు. ఇంకా జరపవలసిన మంత్రతంత్రాలన్నీ జరిపించేశాడు. అతని అధీనంలోకి ఏ దయ్యము రాలేదు.

"అబ్బే! అమ్మాయికి గ్రహదోషం ఏమాత్రం లేదు... ఇది దెయ్యం గియ్యం పని కాదు. మంచి డాక్టర్లకు చూపించండి." అంటూ వెళ్లిపోయాడు.

మరో ఐదు నిమిషాలకే డాక్టర్ పరాంకుశం వచ్చాడు. చాలా వైద్య పరీక్షలు చేయించాడు. రకరకాల నటనలు చేసి రూపలావణ్యను మామూలు స్థితికి తీసుకురాడానికి ప్రయత్నం చేశాడు.



అబ్బే... అతనికి కూడా ఏమాత్రం లైను దొరకలేదు. నీరసంగా కుర్చీలో నుంచి లేచి పెట్టే తట్ట బుట్ట అన్ని సదిరేసుకున్నాడు.

"అహోబిలేశ్వరంగారు మీరు బాగా తెలుసున్న వారు కనుక చెబుతున్నాను. మీ అమ్మాయికి మానసిక స్థితిలో తేడా ఏమాత్రం లేదు. అనవసరంగా డబ్బులు ఖర్చు పెట్టకండి... ఇతర డాక్టర్‌కు చూపించకండి." అంటూ వెళ్లిపోయాడు.

ఏం చేయాలో అర్థం కాక అహోబిలేశ్వరం, మహంకాళమ్మలు... కూతురు ముఖంలోకి దీనంగా చూశారు.


"నేను చెబితే వినరేమిటి నాకు దెయ్యం పట్టలేదు...నిజంగానే నేను చెప్పినవన్నీ చేసి తీరాలి మీరు. ఇదే మీరు నాకు ఇచ్చే నిజమైన పండగ బహుమతి.

ఇదిగో అమ్మానాన్న!! ఈ క్షణం నుండి నేను ఇప్పుడిప్పుడే మాటలు అలవాటు అవుతున్న రెండేళ్లు నిండిన చిన్నపిల్లను అయిపోయినట్టే. అయిపోతున్నాను...అయిపోతున్నాను... అయిపోతు...అయ్యో! అయిపోయాను." అంటూ ముడుచుకుని మాట్లాడకుండా ఒక మూలన మౌనంగా కూర్చుంది రూపలావణ్య.

తప్పక ఆ అమ్మాయితో చిన్నపిల్లతో ఆడుకున్నట్టు ఆడుకోవడం మొదలు పెట్టేసారు ఆమె తల్లిదండ్రులు.

✦✦✦

ఒకరోజు 'లడ్డూబత్తాయి' కావాలి అంటూ




బుంగమూతి పెట్టి అడిగింది రూపలావణ్య.

"లడ్డూబత్తాయి.. అంటే ఏంటమ్మా తల్లి.. బుజ్జి... సరిగ్గా చెప్పు!" అడిగాడు ఆమె తండ్రి గారం చేస్తూ.

"లడ్డూబత్తాయి కావాలి లడ్డూబత్తాయి కావాలి...ఊc...ఊc...ఊc..." అంటూ సామాను పడగొట్టేయడం మొదలు పెట్టింది రూపలావణ్య.

"మీరు ఉండండి మీకు ఏమీ అర్థం కాదు. దానికి లడ్డు కావాలి, బత్తాయి కూడా కావాలి!" అంటూ బెడ్‌రూమ్‌లోకి వెళ్లి గిన్నెలో ఆ రెండు పెట్టి తెచ్చి ఇచ్చింది... రూపలావణ్య ఆ గిన్నె అందుకుని దూరంగా గిరాటు పెట్టింది.

"అది కాదే మనకు వెండి గిన్నె ఉంది కదా ఆ రెండు అందులో పెట్టి అప్పుడు ఇవ్వు!" అన్నాడు అహోబిలేశ్వరం.


మహంకాళమ్మ అలాగే చేసింది.

ఈసారి మరింత దూరంగా గిరాటేసింది రూపలావణ్య. వాళ్ళిద్దరికీ ఎంత ఆలోచించినా లడ్డూబత్తాయి అంటే ఏమిటో తెలియడం లేదు. చాలా సేపు ప్రయత్నించి తలలు పట్టుకు కూర్చున్నారు వాళ్ళిద్దరూ... రూపలావణ్య మాత్రం లడ్డూ బత్తాయి కావాలి... అన్నమాట వదలకుండా చిన్నగా ఏడుపు లంకించుకుంది రెండున్నర సంవత్సరాల పిల్లలా... ఏం చేయాలో అర్థంకాని అహోబిలేశ్వరం తన మొబైల్ తీసి ఆన్ చేశాడు.

అవతల నుండి అతని పెదనాన్న పరమేశ్వర రావు ఫోను ఎత్తాడు.

"పెదనాన్న పెద్ద కష్టం వచ్చింది! నీ మనవరాలు లడ్డూబత్తాయి కావాలంటుంది... అదేంటో మాకు అర్థం కావడం లేదు. నీకు తెలిస్తే చెప్పరా?" అన్నాడు ఏడుపు ముఖం పెట్టి అహోబిలేశ్వరం.

"అదేమిటిరా! లడ్డూబత్తాయి అన్న పేరు ఎప్పుడూ ఎక్కడా వినలేదు. దానికి ముప్ఫై ఏళ్లు నిండాయి కదా! అదేమన్నా చిన్న పిల్ల కాదు కదా! లడ్డూబత్తాయి, గిద్దుబత్తాయి... అన్న పదాలు నాకు ముందు ఏడు తరాల నుండి ఎప్పుడు నా చెవిన పడలేదు... అదేంటో వివరంగా దాన్నే అడుగు చెబుతుంది." అన్నాడు అటు నుంచి పెదనాన్న పరమేశ్వరరావు.




"నీకు తెలియదు పెద్దనాన్న! నీకు ఎలా చెప్పాలో అర్థం కావడం లేదు. దానికి ఇప్పుడు ముప్ఫై ఏళ్లు కాదు...రెండేళ్లు నిండి మూడవ ఏడు. ఇప్పుడిప్పుడే మాటలు వస్తున్నాయి!" అమాయకంగా అన్నాడు అహోబిలేశ్వరం.


"హలో.. మాట్లాడేది మా అహోబిలేశ్వరం గాడేనా?...ఏరా నీకేమన్నా పిచ్చెక్కిందా?... లేకపోతే ఏమైనా మందేసుకున్నావా?... ఏదో సినిమాలో సంఘటనలా అది చిన్నపిల్ల అయి పోయిందని చెబుతున్నావేమిటి?" కోపంగా అడిగాడు పెదనాన్న పరమేశ్వరరావు.

"నీతో తర్వాత మాట్లాడతాను లే పెదనాన్న సెల్ పెట్టేయ్!" అంటూ సెల్ ఆఫ్ చేశాడు అహోబిలేశ్వరం. వెంటనే తనకు బాగా పరిచయస్తుడైన మహా మేధావి,జ్ఞాని సహస్రావధాని చింతామణి శాస్త్రి గారికి ఫోన్ చేశాడు.

"నమస్కారం శాస్త్రిగారు! నేను మీ శిష్యుడిని అహోబిలేశ్వరంని... నాకు పెద్ద సమస్య వచ్చింది సార్ మీరే తీర్చాలి... ఖాళీగానే ఉన్నారు కదా?! విషయం ఏమిటంటే మీ గ్రంథాలలోఎక్కడన్నా లడ్డూబత్తాయి అన్న పేరు వచ్చిందా? దాని గురించి కొంచెం వివరంగా తెలిస్తే చెప్పండి!" వినయంగా అడిగాడు అహోబిలేశ్వరం. అటు నుంచి చింతామణిశాస్త్రిగారు ఆ పదం విని ఆశ్చర్యపడి పోయాడు.

"ఒరేయ్ అహోబిలేశ్వరం! నేను చదివిన బహు గ్రంథాలలో ఎక్కడ ఏ పేజీలోనూ ఏ పేరాలోనూ... ఏ లైనులోను నువ్వు చెప్పిన లడ్డూబత్తాయి అన్న పదం వినలేదురా. పోనీ లడ్డు మీద బత్తాయి నిలబెడదాం అంటే అలా కుదరదు. పోనీ బత్తాయి మీదే లడ్డు నిలబెడదాం అంటే అది కూడా కుదరదు. జారి పడుతుంది. ఎనీ హౌ అంటే... ఏతావాతా చెప్పేది ఏమిటి అంటే... నువ్వు చెప్పిన లడ్డూబత్తాయి అనే పదం మాత్రం వినడానికి చాలా బహుపసందుగా ఉందిరా! లడ్డూబత్తాయి అన్న మాట వింటేనే నోట్లోంచి లాలాజలం ఊరి కింద కారిపోతుంది... అంత మధురంగా ఉంది రా! దాని అర్థం నేను చెప్పలేను కానీ ఒకవేళ నీకు మాత్రం ఎలాగైనా తెలిస్తే నాకు కచ్చితంగా చెప్పు! లడ్డూబత్తాయి మీద నేను ఒక పెద్ద గ్రంథమే రాసేస్తాను... అంతేకాదు రాష్ట్రం మొత్తం తిరిగి పురాణ ప్రవచనాలు కూడా చెప్పి పడేస్తాను!" అంటూ పెద్దగా నవ్వేశారు బహు బిరుదు గ్రహీత చింతామణి శాస్త్రిగారు.




అహోబిలేశ్వరం గుండెలో పెద్ద బండ రాయి పడ్డట్టు అయిపోయింది.

గదిలోకి వెళ్లి చూశాడు తన కూతురు లడ్డూబత్తాయి కావాలంటూ ఇంకా మారం చేస్తూనే ఉంది. మూడేళ్ల పిల్లలాంటిది కనుక నేల మీద పడి దొర్లేస్తుంది.

✦✦✦

అదిగో అలా అలా రూపలావణ్య చిన్ననాటి కోరికలతో, చిన్ని పిల్లమాదిరి అల్లరి చేష్టలతో సంక్రాంతి వెళ్లిపోయి పది రోజులు కూడా గడిచిపోయింది. అహోబిలేశ్వరం లడ్డూబత్తాయి గురించి ఇంకా విషయ సేకరణ చేస్తూనే ఉన్నాడు. ఆ మాట విన్న కొంతమంది నవ్వుతున్నారు... కొంతమంది చీవాట్లు పెడుతున్నారు... కొంతమంది పిచ్చివాడిని చూస్తున్నట్టు చూస్తున్నారు అహోబిలేశ్వరాన్ని.

మొత్తానికి రూపలావణ్య భర్త భజరంగరావు వచ్చి తనతో పాటు ఆమెను బెంగళూరు తీసుకెళ్లిపోయే రోజు రానే వచ్చింది.

భర్త వచ్చాక భర్తతో మామూలుగానే మాట్లాడడం మొదలు పెట్టింది రూపలావణ్య.

అది చూసి సంతోషించారు ఆమె తల్లి దండ్రులు.

మళ్లీ వెంటనే తల్లి దండ్రుల దగ్గరకు వచ్చి–

"నాకు రెండు ఇత్తడిబిందెల నిండా లడ్డూ బత్తాయి రెడీ చేసి పెట్టండి కూడా పట్టుకు వెళ్తాను." అనడంతో మళ్లీ వాళ్ళిద్దరూ తలలు గోక్కోవడం మొదలుపెట్టారు.

వాళ్ళిద్దరూ ఆ సమస్యను పరిష్కరించే దిశగా ఆలోచించి కూతురు తన బెడ్రూమ్‌లో సూట్‌కేసులో బట్టలు సర్దుకుంటున్నప్పుడు... అల్లుడుని మరో గదిలోకి రహస్యంగా తీసుకెళ్లి కూర్చోబెట్టారు. జరిగిన విషయం అంతా చెప్పి అసలు ఆ లడ్డుబత్తాయి అంటే ఏమిటో కాస్త తెలిస్తే చెప్పమని బ్రతిమలాడారు.

భజరంగరావు అరగంటసేపు నవ్వేసు కున్నాడు. కాస్త తేరుకొని– "అత్తయ్యగారు, మామయ్యగారు... నాకు కూడా ఒకసారి ఇలాంటి సమస్య వచ్చింది. చెబుతా వినండి. ఆఫీసుకు నేను వెళుతున్నప్పుడు... "ఏవండీ! మీరు వచ్చేటప్పుడు తెల్లసువాసనలు పట్టుకు రండి... అంది. ఏమిటి అంటూ వివరంగా అడిగాను. మళ్లీ అలాగే..'తెల్లసువాసనలు' పట్టుకు రండి." అంది.

ఆఫీసులోనూ, ఫ్రెండ్ సర్కిల్లోను తెల్లసువా సనలు అంటే ఏమిటి? అని అడిగాను.

వాళ్ళందరూ నాకు మెంటల్ ఎక్కింది అను కున్నారు.

నేను అవి పట్టుకుని వెళ్లకపోవడంతో మీ అమ్మాయి భోజనం మానేసింది.

ఆ తర్వాత నేను కూడా రెండు రోజులు భోజనం మానేశాను.

దాంతో మీ అమ్మాయి ఒక మెట్టు క్రిందకి దిగి నా దగ్గరకు వచ్చి...

"ఏమండీ! కంగారు పడ్డారా... తెల్ల సువా సనలు అంటే మల్లెపువ్వులు." అంది.

నాకు చిరాకెత్తి, చిర్రెత్తి –"మరి ఈ మాట మామూలుగా చెప్పొచ్చు కదా!" అన్నాను.

దాంతో మీ అమ్మాయి ఏమన్నది అంటే.. 'పోదురూ బడాయి.. మరి మొగుడు పెళ్ళాలు సరదాలు ఎలా తీరతాయి." అంది.

ఆ రకంగా తను పొందలేక పోయిన తన సరదాలు తీర్చుకునే మనస్తత్వం అన్నమాట మీ అమ్మాయిది.

ఇంతకీ లడ్డూబత్తాయి అంటే మీ అమ్మా యికి సారెగా ఇవ్వడానికి రెడీ చేసి ఉంచారు కదా లడ్డూమిఠాయి....అదే లడ్డూబత్తాయి... అంటే...." అంటూ మళ్ళీ పక పక నవ్వడం మొదలు పెట్టేసాడు అల్లుడు భజరంగరావు.

అల్లుడు చెప్పింది అంతా విన్న అహోబిలే శ్వరం, మహంకాళమ్మ–

"ఓస్ ఇంతేనా! అమ్మయ్య!!" అనుకుంటూ ఊపిరి తీసి వదిలారు.


భర్తతో తిరుగు ప్రయాణానికి సిద్ధం అయిన రూపలావణ్య... తాను కూడా పట్టుకెళ్ళడం కోసం తన తల్లిదండ్రులు ఇంతకుముందే రెండు ఇత్తడి బిందెలు నిండా రెడీ చేసి ఉంచిన లడ్డూమిఠాయిని మూతలు తీసి చూసుకొని... పరమానందపడిపోయింది.

"అమ్మా,నాన్న! లడ్డూబత్తాయి... రెండు ఇత్తడి బిందెల నిండా చేయించారు. అమ్మో ఎంత బాగుందో!" అంటూ తల్లిదండ్రులను ముద్దులతో ముంచేసింది.

అహోబిలేశ్వరం, మహంకాళమ్మ దంప తులు గండం గట్టెక్కినందుకు కూతురుని వాళ్లు కూడా ముద్దులతో ముంచేశారు.

అంతేకాదు తమ ఒక్కగా నొక్క ముద్దుల కూతురుకు తాము అందమైన బాల్యం దూరం చేసినందుకు ప్రతి సంవత్సరం ఇదే రకంగా బాల్యపు సరదాలు తీరుస్తామని కూతురు చేతిలో చేయి వేసి మాట కూడా ఇచ్చారు.


ఇంకేముంది అక్కడంతా కిలకిలలు... గలగలలు!!










నాగుల చవితి నవ్వులు



యంగర్ జెనరేషన్ వాళ్ళు పుట్టలో పాలు పోయడానికి రావటం లేదేం మమ్మీ!.. ''



పుట్టదగ్గర పాముబిళ్ళలు వెలిగించొద్దండే విన్నావా?


మీరు మంత్రిగారి తాలూకా అయినా కూడా.. పాలు పోయడాలూ.. పూజలు.. ఇక్కడ కుదరవమ్మా
SNAKE PARK
టికెట్ కౌంటర్
చక్రవర్తి


నాగుల చవితికి పుట్టలో పాలు వేయాలి. పుట్ట ఇక్కడ ఎక్కడో ఉండాలి. కొంచెం వెతకండే!
Omkar.


ఈవేళ పుట్టకెళ్ళి నాగదేవతకు పాలు పోయడం కుదరలేదండీ.. అందుకనీ మా అమ్మగారికి కాఫీ బదులు పాలు కలిపిచ్చి.. సరిపెట్టుకున్నానండి!! అత్తయ్యా దేవత అని మీరు చెప్పారుగా.. అని..
చక్రవర్తి


నాగుల చవితి స్పెషల్
చెరువులు, కొండలు కబ్జా చేయడం వలన నగరంలో పుట్టలు ఎక్కడా లేవు. ఆన్‌లైన్ లో ఆర్డరు చేస్తే పుట్ట మీ ఇంటికి పంపబడును!
MOB: xxxxxx xxxx
Omkar


బేబీ కి పాములంటే భయమండీ.. తన డూప్‌ని పంపి పుట్టలో పాలు పోయిస్తే.. ఫలితం దక్కకుండా ఉంటుందంటారా??
కంపిత హీరోయిన్
చక్రవర్తి




**నవంబరుకు...అని ఎడిటర్జీ గుర్తు చేయగానే, 'నవమ్' అనగా క్రొత్తది... 'బరుకు' అంటే గీయు, వ్రాయు... మొదలుపెట్టక తప్పుతుందా చెప్పండి!**

**నవమ్ అంటే కొత్తది అనడం వరకూ బానే వుంది గానీ ఈ 'బరుకు' అనడమే బాగులేదు. బరుకు అంటే ఇష్టం వచ్చినట్లు చిక్కిరి బిక్కిరిగా వ్రాయడం అనీ, గిలుకుట అని అర్థం మరి.**

అంతే కాదండోయ్!.. తోలు లేచునట్లు గీఱడం కూడా బరుకు అనేదానికి అర్థం. నిజం చెప్పాలంటే బరుకుకు అశ్రద్ధగా వ్రాయడం అని అర్థం.




ఏది చేసినా శ్రద్ధగా చేయాలి. మనసు పెట్టి చేయాలి. అలా చేసినా ఒక్కోసారి ఫలితం దక్కి చావదు... మనం అనుకున్నట్లు కుదరక పోతే అది ఏదో బరికినట్లే అవుతుంది.

బాపుగారు బొమ్మ వేసాక చూసుకుని 'బాగా కుదిరింది' అని అనేవారట గానీ బాగా వేసాను అని ఎప్పుడూ అనలేదుట. 'కర్తవ్యం నీ వంతు కాపాడుట నా వంతు' అన్నట్లు... బాగా కుదరడం అనేది మన సంకల్పం కాదు... మన ప్రయత్న ఫలితం మాత్రమే అన్న మాట!

బావుందని గొప్పలు చెప్పుకోవడం డేంజరే! మీకు తెలుసుగా! ఓ నటి, దర్శకుని దగ్గరకు వెళ్ళి– "నా ముక్కు చాలా అందంగా వుందని అందరూ తెగ మెచ్చుకుంటూంటారు... చాలా సెక్సీగా వుంటుందం టారు... నాకు మీ సినిమాలో హీరోయిన్ వేషం ఇవ్వండి..." అని అడిగిందట.

దానికా దర్శకులు "వద్దులే తల్లీ! మరీ అంత సెక్సీగా వుందని సెన్సార్‌వాళ్ళు కోసేసినా కోసే స్తారు!" అని బదులిచ్చాడట.

ఇంతకీ బరుకు గురించి కదూ మాట్లాడుతున్నాం. బరుకుకు గరుకుకు అవినాభావ సంబంధం వుంది. నునుపు కానిది ఏదయినా (ముక్కు అయినా సరే!) గరుకు క్రిందనే లెక్క.

'విషమా తీక్ష్ణ ధారా' అన్నాడు గరుకు గురించి సంస్కృతకారుడు... తీక్షణమైనది గరుకు, బరుకు రాత కూడా అలాంటిదే!

విషమా అంటే ఇక్కడ విషం అనగా గరళం కాదండోయ్! కానీ మొత్తానికి ఎగుడు దిగుడు, హెచ్చు తగ్గులు గల అపాయకరమైనది అనే అర్థం. అంచేత సరుకు ఏదయినా గరుకు, బరుకు కాకూడదు. అలా వుంటే... పెరుకు, నరుకు అని వినిమయదారుడు రెచ్చిపోయే ప్రమాదం వుంది.

నవంబరు అనేది సంవత్సరంలో నెల– పదకొండు. పదకొండు అంటే – కొండు అనగా స్వీకరించుడు అని అర్థం కనుక పద... స్వీకరించుడు అని అర్థం అంచేత నవంబరుకు కొత్తగా గిలికింది ఏదయినా పదకొండు అనగా స్వీకరించుడు అని ప్రాథేయం అన్నమాట!

ఏడాదికి లాస్ట్ బట్‌వన్ నెల నవంబరు చివరికి వచ్చేస్తున్నాం... కనుక రాబోయే కొత్త దాని కోసం ఏదో బరుకు అని నవంబరుకు అన్నారేమో తెలీదు గానీ ఏదయినా పాతబడు తున్న కొద్దీ మోజు తగ్గే ప్రమాదం వుంది. పాత వస్తువులకు గిరాకీ ఒకప్పుడు బాగుండేది. ఆ జమానా పోయింది. ఫుట్‌పాత్ మీద ఆదివారం పాత పుస్తకాలు దర్శించి హైదరాబాద్ అబీడ్స్ రోడ్ల మీద పుస్తకప్రియులు మురిసిపోయిన రోజులు ఇప్పుడు లేవు... అక్కడక్కడా వున్న ఆ 'క్రేజ్' పోయింది.

టీవీ సీరియళ్ళ జీడిపాకం ఆ సీరియల్ పాతబడుతోందనే భావన... వీక్షకులకు అది వెయ్యవ ఎపిసోడ్ అయినా కలగకపోవచ్చు కానీ ఈ రోజుల్లో ఓ పత్రికలో 'కాలమ్' బ్రతికి బట్టకట్టగలగడం అంత ఈజీ కాదు.

# చిలిపి చిలుకలు

మురళీధర్

నిజమే కాలమ్ అయినా... 'కాలం' చేసే సమయం వస్తుంది.

సరుకు తగ్గి, బరుకుతున్నట్లు అనిపిస్తే కార్టూను అయినా, కవిత్వం అయినా పలచ బడి తేలిపోతుంది. వచనం అయినా పచనం కాదు.

నవరసాల్లో అన్నిటికన్నా (అ)ద్వితీయమైనదే అయినా హాస్యం వండటం, పండటం అనేదే నిజానికి చాలా కష్టం.

నవ్వించడం వేరు, నవ్వుల పాలవడం వేరు. శృతి మించితే హాస్యం వెగటు పుడుతుంది. సినిమాల్లో రోతగా బూతుగా అవుతుంది.

అంచేత హాస్యంలో 'నవమ్' ప్రధానం.

అది 'బరాబర్'గా రావాలి!

నవంబరు బరిలో బాలల దినోత్సవం వస్తుంది. హాస్యానందం జీవనానందంగా సదా స్థిరీకృతం కావడానికి పునాది బాలానందం!

అలాగే ఇది కార్తీకమాసం! కారు తీయక పోయినా వనభోజనాలంటూ బస్సేసుకుని వెళ్ళిపోయే మాసం!

వనభోజనం లోనూ 'బఫే'లు ప్రవేశించటం మోసం! వండి వడ్డించడంలోని 'తృప్తి' కూడా ఈ తరంలో తరిగిపోతోంది.


కార్టూన్లను అమితంగా ప్రేమించి...'శంకర్స్ వీక్లీ' చూసేందుకు ఆత్రపడిన ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ పుట్టినరోజు ఈ నెలే అయితే (14) ఎమర్జెన్సీ విధించి ఆ పత్రిక మూత పడేందుకు హేతువైన ఆ నెహ్రూ కుమార్తె ఇందిరాగాంధీ పుట్టినరోజూ ఈ నవంబరే! (19)


ఏ నెల ప్రత్యేకతలు ఆ నెలకి వుంటాయి. అది అంది పుచ్చుకోవడంలోనే వాటిని మలుచుకుని మనుగడ ఏలుగడ చేసుకోవడం లోనే హాస్యానందం వుంది మరి!

సరిగ్గా అయిదేళ్ళ క్రితం మీ సుధామపై ప్రత్యేక సంచిక వెలువరించి హాస్యానందం పంచిన నెలా జీవన సాఫల్యం పుట్టినరోజు ఈ నవంబర్ నెలే!

నవంబరుకు బెరుకుగానే అంచేత... చిత్రంగా ఈ 'వాక్'తో... ఈ నెల వాక్చిత్రం కృతజ్ఞతాంజలి సమర్పితం!!

'నవమ్' 'బరులు' జిందాబాద్!!!








# అతిథి దేవో భవ

కంచనపల్లి ద్వారకనాథ్
9985295605.

**ఆదివారం కృష్ణస్వామి తన రూములో కూర్చుని పాత సినిమా పాటలు ఫ్లూటుతో మధురాతి మధురంగా వాయిసూ... తన్మయత్వంలో మునిగివుండగా భార్య రుక్మాదేవి వచ్చి– "అయ్యా!... కృష్ణస్వామిగారు... ఊదింది చాలు టిఫిన్ చల్లారిపోతోంది వచ్చి తినండి... ఆదివారం అయితే చాలు ఈ పిల్లనగ్రోవి పిలుపులతో ఇంటిని బృందావనం చేస్తుంటారు... ఊఁహు!" అంది.**


"ఒసేవ్ రుక్మి! ఈ పిల్లనగ్రోవితోనే కృష్ణ పరమాత్మ ఎన్నిపనులు చేసాడో తెలుసా?... అసలు సుప్రసిద్ధ వయోలిన్ కళాకారుడు పదేరేస్కి ఏమన్నాడో తెలుసా?"...అని ఇంకేదో చెప్పపోతువుంటే అడ్డు తగిలి...

"ఏం వయోలిన్ గూడా నేర్చుకోమన్నాడా?" అంది చిరుకోపంతో.

"అదికాదే... చెప్పేది పూర్తిగా విను... ప్రతి రోజు కనీసం పది గంటలైన అభ్యాసం చేసే వాడట. ఎందుకని ఎవరైనా అడిగితే ఒక్కరోజు అభ్యాసం చేయకపోతే వయోలిన్ పలకడంలో తేడా... అభ్యాసం చేయకపోతే విమర్శకులు లోపాన్ని ఎత్తి చూపుతారట... ఇంకా ఎక్కువ రోజులు సాధన చేయక అశ్రద్ధ చేస్తే వాయిద్య లోపం శ్రోతలందరికి తెలిసిపోతుంది అన్నాడు తెలుసా?" అనగానే...

'హుఁ.'..అని నిట్టూర్పుతో "మీరు ఇప్పుడు రోజూ ఆ ఫ్లూటు పదిగంటలు వాయిస్తే ఆవులు గేదెలు ఇంటి ముందుకొచ్చి... కుమ్మడానికి రెడీగా వుంటాయి. మీరంత విద్వాంసుడు కాదు కాని... ముందు వచ్చి టిఫిన్ చేయండి!"

"సరే వస్తున్నా లేవే! ఆదివారం కూడా సాధన చేయకపోతే... నాలోని కళ అంతరించి పోతుందేమో అన్న భయం! అందుకని..." అంటుండగా... "మీ ఫ్లూటు విని నేను అంత రించిపోతానేమో!" అని గొణుక్కుని...




"సరే! వచ్చి తిని తర్వాతా తీరిగ్గా వాయించు కోండి!" అంది

టిఫిన్ తినడం అయ్యేసరికి ఫోను మోగింది

ఫోను ఎత్తి– "హలో... నువ్వా కుచేల్! ఎలా వున్నావ్?" అన్నాడు.

"ఒరేయ్! కృష్ణ చాలా రోజులైంది రా నిన్ను చూసి... ఎప్పుడు ఫోనుల్లో మాట్లాడుకోవడం తప్ప కలవడం కుదరడంలేదు... అందుకే ఇప్పుడు ఓ వారం రోజులు వచ్చి... నీ దగ్గర వుందామనుకుంటున్నా. నా భార్య, కొడుకుని చూడడానికి అమెరికాకి పోయింది. నాకు బోర్ కొడుతోంది అందుకని రావాలని ఫిక్స్ అయ్యా ఏమంటావ్?"

"సంతోషకరమైన వార్త చెప్పావ్! రా...రా మనం కలిసి చాలా రోజులైంది... చాలా కబుర్లు, చిన్ననాటి ముచ్చట్లు చెప్పుకుందాం!" అన్నాడు."

"అలాగే! రేపేవస్తున్నా!" ఫోన్ పెట్టేసాడు.

అంతా విన్న రుక్మా దేవి– "ఎవర్ని ఫోనులో రమ్మంటున్నారు?" అంది.

"నా మిత్రుడు కుచేల్‌రావ్ చిన్ననాటి స్నేహి తుడు...ఎప్పుడు చెపుతుంటానే వాడే!... ఒక వారం వచ్చి ఇక్కడ నాతో సరదాగా గడిపి పోతానంటున్నాడు. వాడి భార్య, కొడుకుని చూడాలని అమెరికా వెళ్లిందట." అన్నాడు.

'ఈయన కృష్ణుడు... ఆయన కుచేలుడు! సరిపోయారు ఇద్దరును!...' అని మనసులో గొణుక్కుని వంటింటిలోకి వెళ్లి – 'ఇక వారం రోజులు ఏం చేయాలో? ఎంత డబ్బు వుంటే మాత్రం పొదుపు చేసుకుంటూ ఆచి తూచి ఖర్చు పెడ్తూ సంసారం నెట్టుకొస్తున్నా...అంతా నా తలరాత! అతిథి దేవోభవ అన్నారు. ఇదేదో నా పాలిట అతి, దేవోభవలా వుంది' అని పనిలో మునిగిపోయింది.

✦✦✦

కుచేల్ రావ్ భుజానికో బ్యాగు తగిలించు కుని, చేతిలో చిన్న సూట్‌కేస్‌తో కృష్ణస్వామి ఇంట్లోకి కుడికాలు పెట్టి లోపలికి వచ్చి–

"హాయ్ కృష్ణ!" అని ఎదురుగా కూర్చుని వున్న కృష్ణస్వామిని పలకరించగానే కృష్ణస్వామి వళ్ళంతా పులకరించి– "రా!రా!! నీవు ఎప్పు డెప్పుడు వస్తావా అని ఎదురు చూస్తున్నా!...

ఏమేవ్! రుక్కు... నా చిన్ననాటి స్నేహితుడు కుచేల్ వచ్చాడే చూడు!" అనగానే...

లేని నవ్వు తెచ్చుకుంటూ... వంటింట్లో నుండి బయటికి వచ్చి– "అన్నయ్యగారు... బాగున్నారా? మీ గురించి మా ఆయన చెప్పని రోజు వుండదు అనుకోండి!" అని పలకరించింది.

"ఆc!...బాగున్నానమ్మా!" అన్నాడు ముక్తసరిగా.

"ఊరి నుండి వచ్చావు! త్వరగా ఫ్రెష్ అయ్యి రారా... వాడికి కాఫీ ఇవ్వవే!" అన్నాడు.

"అలాగే!" అంటూ వెళ్ళిపోయింది.

కుచేల్ అన్ని ముగించుకుని వచ్చి సోఫాలో కూర్చున్నాడు.

"ఒరేయ్ కుచేల్!.. నీ కోసం ఏం టిఫిన్ చేయించమంటావురా?... రాకరాకవచ్చావు!" అన్నాడు కృష్ణస్వామి.

"ఏమి లేదు... సింపుల్‌గా పెసరట్టు ఉప్మా చేయించు ఈవాల్టికి" అనగానే...

"రుక్కు! మనవాడికి వేడి వేడిగా ఉప్మా పెసరట్టు కావాలట! చేసి పెట్టు!" అన్నాడు.

"అలాగే!" అని...

మనసులో 'భలే స్నేహితుడు దొరికాడు చేయక చాస్తానా?' అనుకుంటూ... రుక్మాదేవి వంట యుద్ధం ప్రారంభించింది.

పూటగడిచింది మధ్యాహ్నం వరకు కబుర్లు చెప్పుకున్నారిద్దరు.


"ఏరా!... భోజనంలోకి నీకిష్టమైనవేవో చెప్పురా చేయిస్తాను!" అన్నాడు కృష్ణ.


"మీఇంట్లో టిఫిన్‌తోనే వంట ఎంత రుచిగా వుందో తెలిపోయింది... అందుకని మంచి కొబ్బరి పచ్చడి, ములక్కాడల పులుసు నంచు కోవడానికి గుమ్మడి కాయల వరుగులు, గడ్డ పెరుగు చాలు!!"

"భలే చెప్పావురా! నీ టేస్టే...టెస్టురా!" అని రుక్మాదేవిని పిలిచి చెప్పాడు మెనూ.

'వీడి కోరికలు మండా! రుచి మరిగిన కోడి అంటారు అలా వుంది వీడి తీరు!.. ఇతగాడి పెళ్ళాం ఇవన్నీ వండి పెడుతుందో లేదో కాని






ఆ తీరని కోరికలన్నీ ఇక్కడికి వచ్చి తీర్చుకుంటున్నాడు... ఇతని పెళ్ళాం కూడా వచ్చివుంటే నా దుంప తెగివుండేది!...' అని మనసులో అనుకుంటూ... మళ్ళీ వంట యుద్ధం ప్రారంభించింది.

భోజనాలు ముగిసిపోయి కబుర్లు చెప్పుకుంటున్నారు.

'ఆనాటి దరిద్రంలో కొట్టు మిట్టాడుతూ ఆకలితో అలమటిస్తూ బోలెడు మంది పిల్లలతో ఉన్నకుచేలుడికి కృష్ణపరమాత్మ సేవ చేసి సకల సంపదలు కలిగించాడు... యితడు మా చేత సేవలు చేయించుకుని ఏమైనా అప్పు అడుగుతాడా అని సందేహం వస్తోంది!' అని మనస్సులో అనుకుంది రుక్మాదేవి.

"ఒరేయ్ కృష్ణ! సాయంత్రం వేడి వేడి పకోడీలు తినాలని వుందిరా! మీ ఆవిడకి చెప్పరా!" అన్నాడు.

"అంతకంటే ఏం భాగ్యం?" అన్నాడు.

అది విన్న రుక్మాదేవి– 'నాకే గనక ఆ కాలంలో దేవతల్లా మహిమలువుంటే ఆ శక్తితో ఇతన్ని మాడ్చి మసి చేసి ఉండేదాన్ని!' మనసులో అనుకుంది.

"కృష్ణా! నేను వచ్చినప్పటి నుండి నా గుడ్డలు వుతుక్కో లేదురా! కాస్త వాష్ చేసి పెట్టమని... మీ ఆవిడతో చెప్పరా!" అనగానే...

"అదెంత పని! వాషింగ్ మిషన్ లో పడేస్తే సరిపోతుంది... నేను రుక్కుతో చెప్తాలే!" అన్నాడు.

ఇలా వారం రోజులు గడిచి పోయాయి.

"కృష్ణా! నేను వచ్చి తెలియకుండానే ఇంత త్వరగా వారంరోజులు గడిచిపోయాయి... మనం చదువుకునే రోజుల్లో చేసిన పనులు, బాధలు సంతోషాలు చెప్పుకున్నాం... ఎంతో సంతోషంగావుంది... ఇక నేను బయలు దేరుతాను!"

ఆ మాటలు విన్న రుక్మాదేవి ఆహా ఈ రోజు ఎవరి ముఖం చూశానో మంచి వార్త విన్నాను అనుకుంటుండగా...

కుచేల్ "కృష్ణా! ఓసారి మీ ఆవిడను పిలు!" అన్నాడు.


కృష్ణ పిలవగానే రుక్మి వచ్చినిలబడగానే...

"అమ్మ ఒక ప్లేటు తీసుకుని రా!" అన్నాడు కుచేల్.

ప్లేటు తేవడానికి వెళ్ళగానే కుచేల్ సూట్ కేస్ తెరిచి ఒక మంచి ఖరీదైన పట్టుచీర, గాజులు, ప్యాంటు, షర్టు తీసి... ఆమె తెచ్చిన ప్లేటులో పెట్టాడు.

"అమ్మ చెల్లెమ్మ! ఇటురా మా కృష్ణయ్య పక్కన కూర్చో!" అనగానే కూర్చుంది.

"అమ్మ! నా భార్య రాలేకపోయింది... ఆమె ఎవరింటికి పోయిన తన ఇంటికి వచ్చినా... ఇలా గుడ్డలు పెట్టి వాళ్ళను గౌరవంగా సంప్రదాయ పద్ధతిలో పంపుతుంది. అందుకే




# కా.కా.క.క.


(కాకతాళీయ కార్టూన్ల కథా కమామీషు)

బ్నిం



**ఒ**కే కార్టూన్ని పదిమంది కార్టూనిస్టులు కొద్ది మార్పులతో గీయడం జరుగుతుంది. చాలామంది అది 'కాపీ' కార్టూను కదా అనుకుంటారు. అలా అనుకోవడానికి వీలు లేదు. ఎందుకంటే ఒకే ఐడియా ఇద్దరు ముగ్గురు కార్టూనిస్టులకు రావడం సహజమే! అది 'కాకతాళీయం' మాత్రమే! **కాకతాళీయంగా గీసిన కార్టూన్లకు ఉదాహరణ ఈ శీర్షిక!** ఎవరు ముందు గీసారు? ఎవరు వెనుక గీసారు? అని కాకుండా ఇద్దరు కార్టూనిస్టులు ఒకే ఐడియాని ఎలా ప్రజెంట్ చేశారో తెలియ జేయడమే ఈ శీర్షిక ఉద్దేశం!




ఆమె చెప్పినట్లు ఇవి మీకు ఇమ్మని పంపింది." అని వాళ్ళిద్దరి చేతుల్లో పెట్టాడు.

ఆమె కళ్ళు చమర్చాయి.

కుచేల్ 'తన బ్యాగులో నుండి రెపరెపలాడే నోట్లు తీసి కృష్ణ చేతిలో పెట్టాడు.

"ఎంటిరా ఇది!?.. నేను నీ ప్రాణ స్నేహితు డిని కదా? ఏమన్నా బాగుందా?"అన్నాడు.

"చెల్లెమ్మ! మేమిద్దరం ఒకే బడి, ఒకే కాలేజీలో చదువుకుంటూ ఒకే రూములో ఉన్న పుడు వీడు నాకు లెక్కలు, సైన్సు సరిగా రాన పుడు...నా పాలిట అర్జునునికి కృష్ణుడు భగ వద్గీత బోధించినట్లు బోధించాడు. వీడు నాకు విద్యాదానం చేయబట్టి ఇంత వాడినయ్యాను. ఈరోజు వ్యాపారంలో ఎంతో లాభం వస్తోంది.

ఇకపోతే మేమిద్దరం చిన్నప్పటినుండి అన్ని సంతోషాలు, బాధలు, డబ్బులు, కష్ట సుఖాలు పంచుకున్నాం. నేను వీడు ఏది కొన్న, తిన్న, రూము బాడుగ అన్ని షేర్ చేసుకునే వాళ్ళం, పొదుపు వీడి ద్వారానే నేర్చుకున్నాను. ఈ రోజుల్లో రోజు రోజుకి నిత్యవసర వస్తువులు పెరిగి పోతున్నాయి... మీరు చూపిన ఆదరణ, మీరు వండి పెట్టిన తిండి... అన్ని మీకు ఊరికే రావని తెలుసు, నేను వాటికి ఖరీదు కట్టడం లేదు. ఆనాడు కుచేలుడు ఇచ్చిన పిడికెడు అటుకులకి కృష్ణుడు సిరి సంపదలు ఇచ్చాడు. కృష్ణ నాకు విద్యను బోదించి, సిరిసంపదలు, పొదుపు ఎలా చేయాలో నేర్పాడు. మీరు మా ఇంటికి వచ్చినా నేను మీ దగ్గరనుండి డబ్బులు వసూలు చేస్తాను!' అన్నాడు నవ్వుతూ.


ఆ మాటలు విన్న రుక్మాదేవికి కళ్ళల్లో నీలు తిరిగాయి.

"అన్నయ్య! నేను అనవసరంగా మనసులో అపార్థం చేసుకున్నాను నన్ను క్షమించండి." అంది.

"మీరు తప్పక మా ఊరు రండి!...అన్ని గుడులు స్థలాలు చూపిస్తాను..." అని తన బ్యాగులు తీసుకుని బయలుదేరాడు.

బస్టాండ్‌లో కుచేల్‌ని దింపి, ఇంటికి వచ్చిన కృష్ణస్వామి టేబుల్ పైన ఉన్న ఫ్లూటు అందు కుని వాయించ సాగాడు.

వంటింట్లో ఉన్న రుక్మాదేవికి కృష్ణ, కుచేల స్నేహబంధం ఇంత గొప్పదా అని అనుకుం టున్నప్పుడు వేణు నాదం మధురంగా వినిపిం చింది.



# నవ్వులాట



గాంధీ మనోహర్, 98490 51846

## స్వంతిల్లు స్వాహా

ఏమి జరిగినా అంతా మన మంచికే అని అనుకోవాలని ఎవరు చెప్పారో గానీ అది అక్షరాల నిజమని రామానుజం పొద్దుట్నుండి కొన్ని వందలసార్లు అనుకున్నాడు.

రామానుజం ఎందుకలా అనుకున్నాడు అని తెలియాలంటే కొన్ని రోజులు వెనక్కి వెళ్ళాలి.

✦✦✦

రామానుజం ఇరవై ఐదేళ్ళ క్రితం హైదరాబాద్‌కు వచ్చి ఓ చిన్న ఉద్యోగంలో జాయిన్ అయ్యాడు. ఆ తర్వాత సుమతి అనే ఆవిడను పెళ్లి చేసుకుని, ఓ సుపుత్రుడ్ని కన్నాడు. వాడి పేరు కార్తీక్. అతగాడు ఇంజినీరింగ్ కంప్లీట్ చేసి ఉద్యోగ ప్రయత్నాల్లో వున్నాడు.

రామానుజం ఉద్యోగంలో జాయిన్ అయిన మొదట్లో సిటీ శివార్లలో స్థలం తీసుకుని అక్కడ ఓ ఇల్లు కట్టు కున్నాడు. ఇప్పుడు దాని విలువ దాదాపు రెండు కోట్లు పైనే వుంటుంది.

ఆ ఇల్లు కట్టడం కోసం రామానుజంతో పాటు తన భార్యా, కొడుకు కూడా ఎన్నో కోరికల్ని అణచుకున్నారు. అవేమీ లగ్జరీ కోరికలే కాదు. టీలు కాఫీలు తాగడం లాంటివే. ఏమైతేనేమి ఇప్పుడు వాళ్ళు ఉండటానికి ఓ స్వంత ఇల్లు వుంది. ఆ ఇల్లు చూసుకున్నప్పుడల్లా గతంలో వాళ్ళు ఆ ఇంటి కోసం పడ్డ కష్టాలన్నీ మర్చిపోతుంటారు.

✦✦✦

ఈ భూమ్మీద పుట్టిన ఏ మనిషి జీవితం సాఫీగా సాగదనీ ప్రతి ఒక్కరికీ లైఫ్‌లో సుఖాలతో పాటు కష్టనష్టాలు కూడా ఉంటాయన్న యధార్థం అందరికీ తెల్సిందే.

అలాగే రామానుజం లైఫ్‌లోకి పెద్ద కష్టం ఎంటర్ అయింది... ఒక రోజు రామానుజం భార్య సుమతి స్పృహతప్పి... కింద పడిపోయింది. ఆదరాబాదరా అక్కడే దగ్గర్లో వున్న క్లినిక్ కు తీసుకెళ్ళారు. ఆ క్లినిక్ వాళ్ళు వాళ్ళకు తోచిన టెస్టులు చెడా మడా చేసి పాతిక వేలు వసూలు చేశారు. ఆ దరిమిలా 'ఈ జబ్బు ఇక్కడ నయం కాదు...వెంటనే ప్యారడైజ్ హాస్పిటల్‌కు వెళ్ళండి' అని వాళ్ళే స్వంత ఖర్చులతో అంబులెన్స్ ఎరేంజ్ చేసి అక్కడికి పంపారు. అది కార్పోరేట్ హాస్పిటల్. అక్కడికి ఏ పేషంట్ వెళ్ళినా పదేండ్లు ఆర్థికంగా కోలుకోలేరని మీమర్స్ మీమ్స్ చేసి సోషల్ మీడియాలో పెడుతుంటారు.

ఎప్పుడూ వినని ఇంగ్లీష్ డిసీజ్ చెప్పి... అది సుమతికి వచ్చిందనీ, ఆ జబ్బు కోట్లమందిలో ఒక్కరికి వచ్చే వ్యాధనీ దానికి ట్రీట్‌మెంట్ ఇవ్వాలంటే యాభై లక్షలు దాకా అవసరం ఉంటుందని ఆ కార్పోరేట్ హాస్పిటల్‌వారు చల్లగా చెప్పారు.

వేరే వాళ్ళను అప్పు అడగడం స్వతహాగా ఇష్టం లేని రామానుజం తను ఎంతో ఇష్టంతో కట్టుకున్న ఇల్లుని అమ్మీ భార్యకు ట్రీట్‌మెంట్ ఇప్పించాలని నిర్ణయించుకున్నాడు. ఇదే విషయాన్ని కొడుకు కార్తీక్‌తో చెప్పి ఒప్పించాడు.

ఈ విషయం తెల్సుకున్న నందగోపాల్ హాస్పిటల్‌కు వచ్చి రామానుజం కలిశాడు.

రామానుజంకు, నందగోపాల్ ఫ్రెండ్ మాత్రమే కాదు... దూరపు బంధువు కూడా. సుమతి ఆరోగ్యం గురించి నందగోపాల్ అడిగిరాని కన్నీళ్ళని కర్చీఫ్‌తో తుడుచుకుని తెగ బాధపడినట్టు నటించాడు.

"హాస్పిటల్ ఖర్చులకు ఇల్లు అమ్మాలనుకుంటున్నా!..." అని నందగోపాల్‌తో మాట్లాడుతూ అన్నాడు రామానుజం.

'డబ్బు కావాలంటే నన్ను అడుగు! లేదా ఎక్కడైనా అప్పు చేయ్! అంతే కాని ఎంతో ఇష్టపడి కట్టుకున్న ఇల్లు ఎందుకు అమ్ముతావ్?' అని నందగోపాల్ అననందుకు మనసులో బాధ పడ్డాడు రామానుజం.

రామానుజం ఆ ఇల్లుని ఎంతో కష్టపడీ అంతకు మించి ఇష్టపడి కట్టుకున్నాడని నందగోపాల్‌కి తెల్సు. తను ఐదూ పదీ రూపాయల వడ్డీలకు అప్పులిస్తుంటాడు.

నందగోపాల్‌ని అప్పు అడుగుదామనుకుని ఎలాగూ పాజిటివ్ రెస్పాన్స్ రాదని అడగడం మానేశాడు రామానుజం.

ఇంతలో నందగోపాల్– "నా దగ్గర ప్రస్తుతానికి పదివేలు కూడా లేవు. ఉందుంటే యాభై లక్షలూ నేనే వడ్డీ లేకుండా ఇచ్చేవాడ్ని. బయట ఎక్కడైనా అప్పు తీసుకొచ్చి నీకు ఇవ్వొచ్చు... కానీ వెధవలు పదిరూపాయలు వడ్డీ అంటారు.



నెల నెలా అంతంతా వడ్డీ కట్టే బదులు ఇల్లు అమ్మడం బెటర్ !" ఉచిత సలహా ఇచ్చాడు.

"నీకు తెల్సిన వాళ్ళు ఎవరైనా వుంటే చెప్పు నందగోపాల్! నా ఇల్లు అమ్ముతాను. మార్కెట్ రేట్ రెండు కోట్లు వున్నా...కోటీ ఎనభై లక్షలకు ఇచ్చేస్తా!"శాడ్‌టోన్‌తో అన్నాడు రామానుజం.

రామానుజం ఇల్లు వున్న ఏరియా చాలా మంచిది. భవిష్యత్తులోఆ ప్రాంతం ఇంకా బాగా డెవలప్ అవుతుందని నందగోపాల్‌కి తెల్సు.

"అలా ఐతే ఓ పని చేస్తాను...నేనే ఎక్కడైనా పదిరూపాయలవడ్డీకి అప్పు తెచ్చుకుని, నీ ఇల్లు నేనే కొనుక్కుంటాను!" అని టక్కున అనేశాడు నందగోపాల్.

"అలా ఐతే ముందు నాకు యాభై లక్షలు ఇవ్వు! అగ్రిమెంట్ రాసుకుందాం! మిగతా అమౌంట్ రిజిస్టర్ రోజు ఇద్దువు గానీ!" అని అనగానే... "సరే!" అని అక్కడి నుండే ఎవడినో పది రూపాయల వడ్డీకి యాభైలక్షలు అప్పు అడిగినట్టు డ్రామాఆడీ... అది తీసుకోడానికి వస్తున్నట్టు చెప్పి నందగోపాల్ అక్కడినుండి వెళ్ళిపోయాడు.

ఇంటికి వచ్చిన నందగోపాల్ తన భార్యను అడిగి యాభై లక్షలు తీసుకుని ప్యారడైజ్ హాస్పిటల్‌కు బయలుదేరాడు.

రామానుజంకు యాభై లక్షలు ఇచ్చి మూడు నెలల తర్వాత రిజిస్టర్ చేసుకునేట్టు సేల్ డీడ్ అగ్రిమెంట్ రాయించుకున్నాడు నందగోపాల్.

✦✦✦

రామానుజం లైఫ్‌లో ఊహించని మరో దుర్ఘటన చోటు చేసుకుంది.

హాస్పిటల్లో ట్రీట్‌మెంట్ తీసుకుంటున్న సుమతి కన్ను మూసింది. అప్పటివరకు హాస్పిటల్ ఖర్చు పదిలక్షల దాకా అయింది.

✦✦✦

సుమతి చనిపోయి... మూడు వారాలు గడిచాయి.

"నాన్న! అమ్మ హాస్పిటల్లో వుండగా మా ఫ్రెండ్ వాళ్ళనాన్నను డబ్బు అప్పుగా అడిగాను. అప్పుడు లేవు అన్నాడు. ఇప్పుడు ఫోన్ చేసి కావాలంటే పట్టుకెళ్లు అంటున్నాడు. అది తెచ్చి రామానుజం అంకుల్‌కు ఆ డబ్బులు ఇచ్చేసి మన ఇల్లు అమ్మము అని చెబుదామా?"

## ఈ నెల 'దినం'



**అంతర్జాతీయ సహన దినోత్సవం -నవంబర్,6**




"వద్దురా! అది పద్ధతి కాదు. అయినా దానికి నందగోపాల్ ఒప్పుకోడు!"

"అది కాదు నాన్న! నీకు ఈ ఇంటితో ఎమోషనల్ ఎటాచ్‌మెంట్ వుంది... పైగా ఎంతో ఇష్టపడి కట్టుకున్నావ్. నందగోపాల్ అంకుల్‌ని నేనే అడిగి చూస్తాను!" అని అన్నాడు.

"నీ ఇష్టం రా! నాకు ఈ విషయం తెలీనట్టుగా నువ్వే అడిగి చూడు! ఒప్పుకుంటే సరే... లేదంటే నందగోపాల్‌ని అంతకంటే ఎక్కువ ఇబ్బంది పెట్టకు" అని అన్నాడు.

✦✦✦

కార్తీక్ తన నాన్నకి ఆ ఇంటి మీద వున్న భావోద్వేగ అనుబంధం గురించి నందగోపాల్‌తో చెప్పి... అమౌంట్ తిరిగి వడ్డీతో సహా ఇచ్చేస్తామనీ సేల్ డీడ్ అగ్రిమెంట్ రద్దు చేసుకోమని ఎన్నో రకాలుగా చెప్పి బ్రతిమాలాడుకున్నాడు.

నందగోపాల్ ఏవేవో కారణాలు చెప్పి... అందుకు ఎంత మాత్రం ఒప్పుకోలేదు.

చివరికి రామానుజం తన ఇంటిని నందగోపాల్‌కు రిజిస్టర్ చేయించేసాడు.

రామానుజం తన ఇల్లు అమ్మగా వచ్చిన డబ్బుతో మరోచోట ఇల్లు కొనేశాడు.

ఆ ఇల్లు కూడా రామానుజంకు బాగా నచ్చడంతో తన స్వంతింటి మీద వున్న ప్రేమా అభిమానం పూర్తిగా తగ్గిపోయి... దాని సంగతే మర్చిపోయాడు.

✦✦✦

నెల రోజుల తర్వాత ఒకరోజు అనుకోకుండా రామానుజం తన పాత ఇంటి మీద మీదుగా వెళ్తుండగా అక్కడ జరుగుతున్న సంఘటన చూసి షాక్ అయ్యాడు.

తన డ్రీం హౌస్‌తో పాటు అక్కడ చాలా ఇల్లు ఇప్పుడు నేల మట్టమై వున్నాయి.

అక్కడ వున్న ఓ వ్యక్తిని–

"ఎందుకు ఆ ఇల్లన్నీ అలా కొట్టేశారు?..." అని అడిగాడు రామానుజం.

"ఇది వరకు ఇక్కడ ఓ చెరువు ఉండేదట... ఈ ప్రాంతంలో వున్న ఇళ్లన్నీ ఎఫ్టీఎల్ కిందికి వస్తాయని నిన్నటి రోజు 'హైడ్రా' వాళ్ళు వచ్చి పడగొట్టేశారు!" అని అన్నాడు.

తన భార్య చనిపోతూ... తనని ఇల్లు లేనివాడిగా చేయకుండా చేసి పోయిందని రామానుజం ఆమెకు మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకుని... ఏది జరిగినా మన మంచి కోసమే అనుకోవాలని మరోసారి అనుకున్నాడు.



# మై హూనా...

'అభిమన్యు'
9440204748

**"మనం రేపు బెంగుళూరు వెళ్తున్నాం."**

**"ఆఁ!....దేనికీ?..."**

**"మరిచిపోయారా?...మా పిన్ని కూతురు కూతురు పెళ్ళి."**

**"వెళ్ళటం అంత అవసరమా?"**

**"అయ్యో... అలా వెళ్ళకపోతే ఎలా!... మన ఇళ్ళల్లో జరిగే కార్యాలకి వాళ్ళూ వస్తున్నారు కదండీ... కాబట్టి రేపు ఫ్లైట్‌లో వెళ్తున్నాం." అంది పద్మావతి.**

**"ఫ్లైట్‌లోనా!..." మరింత ఆశ్చర్యపోయాడు సుందరం.**

**"అవును! ఏం...?" అంది పద్మావతి.**

"నేనెప్పుడూ ఫ్లైట్ ఎక్కలేదు... నాకు ఫ్లైట్ అంటే భయం." అన్నాడు సుందరం.

"ఎవరైనా నవ్వుతారు..." అని నవ్వింది పద్మావతి.

"నిజంవోయ్...పోనీ ట్రైన్‌కి వెళ్దాం!"

"ట్రైన్‌కి టిక్కెట్లు లేవు...అందుకే ఫ్లైట్‌కి బుక్ చేసాను. అంత భయపడితే ఎలాగండీ... నేనున్నానుగా..." అని భరోసా ఇచ్చింది పద్మావతి.

సుందరం ఫ్లైట్ ఎప్పుడూ ఎక్కలేదు. ఎగిరే విమానాల్ని చూడ్డం కూడా అరుదు. తనకు తెలిసిందల్లా ఎర్రబస్సు, పల్లెవెలుగు బస్సు. ఏదైనా ఊరు వెళ్ళాలంటే బస్సుని పట్టుకునే వాడు. ఇప్పుడు ఫ్లైట్‌లో ప్రయాణం అంటే గుండె గుభేలుమంది.

✦✦✦

విశాఖపట్నం ఎయిర్‌పోర్టు దగ్గర టాక్సీ లోంచి దిగాడు సుందరం దిగాలుగా.



ముందు భార్య పద్మావతి వ్యానిటీబ్యాగ్ భుజానికి తగిలించుకుని, వయ్యారంగా నడు స్తుంటే ఆమె వెనుక రెండు చేతులతో సూట్ కేస్‌లు పట్టుకుని నడుస్తున్నాడు నెమ్మదిగా సుందరం.

"ఆ నడకేంటండీ పెళ్లికూతురులా త్వరగా రండి! అవతల టైం అవుతూంది..." అని గదమాయించింది పద్మావతి వెనక్కి చూసి.

టిక్కెట్లు, ఆధార్‌కార్డులు చూపించారు.

సి.ఎస్.ఎఫ్. జవాన్ వెరిఫై చేసాక చెక్‌ఇన్, బ్యాగేజ్ స్కాన్ చేసాక బోర్డింగ్ పాస్ తీసుకుని బోర్డింగ్ ఏరియాలో కూర్చున్నారు.

ఈ తతంగం అంతా తలకాయ నెప్పిలా ఉంది సుందరంకి.

"కాఫీ తాగుతారా...?" అడిగింది పద్మావతి సుందరాన్ని.

"కాఫీ కాదు గాని... పద్మావతి నేను రాలేనే. నాకు భయంగా ఉంది. నేను వెనక్కి వెళ్ళిపోతాను." అని పద్మావతి చేతులు పట్టు కుని బ్రతిమలాడాడు సుందరం.

పద్మావతి వినలేదు. అతగాడి భుజం తట్టి "నేనున్నానుగా... అంటూనే మై హూనా..." అంటూ హిందీలో కూడా ధైర్యమిచ్చింది."

అనౌన్స్ చేసాక బోర్డింగ్ పాస్‌లో సూచిం చిన గేటు ద్వారా ఫ్లైట్ ఎక్కారు.

ఎంట్రన్స్‌లో ఎయిర్‌హోస్టెస్ సాదరంగా ఆహ్వానించింది.

వర్షంలో తడిసిన పెంగ్విన్ పక్షుల్లా ఉన్నారు ఎయిర్ హోస్టెస్‌లు. విండో ప్రక్క సీటులో సుందరం, అతని ప్రక్క సీట్‌లో పద్మావతి సీట్ బెల్ట్ కట్టుకుని కూర్చున్నారు.

విమానం బయలుదేరింది.

సుందరం గుండె దడదడలాడింది.

నేలమీద చెట్లు, పెద్ద పెద్ద భవంతులు క్రమంగా చిన్నచిన్నవిగా కనిపిస్తున్నాయి.

కిటికీ అద్దంలోంచి చూస్తే తెల్లటి మేఘాల తునకలు స్వాగతం పలుకుతున్నట్లుగా ఉంది. ఆ మేఘాలలో విమానం దూసుకుపోతుంది.

సుందరం ఇవేవీ గమనించటంలేదు.

మతి చలించి, భార్య మాట కాదనలేక మొదటిసారి విమానం ఎక్కానని... నన్ను క్షమించి క్షేమంగా ల్యాండ్ అయ్యేట్లుగా...

చూడమని దేవుణ్ణి ప్రార్థించాడు.

బస్సు గాని, రైలు గాని ప్రమాదం జరిగితే కొద్దిమంది ప్రాణాలే పోతాయి. అదే విమానం ప్రమాదానికి గురైతే ఎవ్వరూ బ్రతకరని సుందరం భయం.

మరుక్షణం విమానంలో చిన్న కుదుపు ఏర్పడింది.

ఆ కుదుపు వలన విమానం చిన్నగా ఒరిగింది.

ఈ జర్క్‌కి ప్రయాణీకులందరూ హడలి పోయారు...కేకలు... గుండెల మీద చేతులు వేసుకున్నారు భయం భయంగా.

"భయపడాల్సింది ఏమీ లేదని... మేఘాలు అడ్డు వచ్చినప్పుడు ఇలా జరుగుతుంద"ని ఎయిర్‌హోస్టెస్ చెప్పడంతో ప్రయాణీకుల్లో కొంత అలజడి తగ్గింది.

కాని సుందరానికి భయం పోలేదు.

విమానం వెనక్కి వచ్చేస్తే బాగుణ్ణు అని దేవుడ్ని ప్రార్థించాడు. అయితే తను ప్రయాణించే విమానం భూమి ఉపరితలానికి ముప్పై వేల అడుగుల ఎత్తులో ప్రయాణిస్తుందని...విమానాలు ఆకాశంలో ముందుకు వెళ్ళడం తప్ప వెనక్కి వెళ్ళడం ఉండదని వాటికి రివర్స్‌గేర్లు ఉండవని...పాపం సుందరంకి తెలియదు. సుందరంకే కాదు చాలామందికి తెలియదు.

సుందరం అలవోకగా ప్రక్కకి చూసి గతుక్కుమన్నాడు.

తన నమ్మకం... తన ధైర్యం... 'ఐమాస్క్' వేసుకుని ఎంచక్కా నిద్రపోతుంది. అవునులే మైహూనా అని అంది కదా? ఉంది అంతే!

ఎవరి భయం వారికే సొంతం!

(సహకరించిన 'మహీ'కి కృతజ్ఞతలు.)






ముత్యాల శ్రీశరత్‌బాబు
9963298921

కార్టూన్స్: నాగిశెట్టి


**"ఇ**దేమిట్రా! అక్కడ నీ పెళ్లి జరుగుతుంటే నీవిలా పెళ్లిమండపం నుండి బయటకు వచ్చేస్తున్నావు?" అడిగాడు వెంకట్ పెళ్లికొడుకు ప్రదీప్‌ని.



"అక్కడ పెళ్లికూతురుని తీసుకు వస్తున్నారు పక్కకి జరగండి... పక్కకి జరగండి... అని అరుస్తున్నారు అందుకే ఇలా వచ్చేసా." ఠక్కున చెప్పాడు ప్రదీప్.

**రా**జకీయ నాయకుడు మాట్లాడుతున్నాడు–

"పురుషులందు పుణ్యపురుషులు వేరయా అంటారు, వారంటే ఎవరనుకుంటున్నారు?"

"అప్పిచ్చేవాడు సార్!" ఠక్కున అన్నాడు సభికులలో ఒకడు.




**"నా** మీదకి ఎవరయినా దాడి చేస్తే నీవేం చేస్తావే?" అడిగాడు భార్యను సుబ్బారావు

"వెంటనే షూట్ చేస్తా."

అంది భార్య.

"నీ దగ్గర గన్ లేదు కదే... ఎలా షూట్ చేస్తావ్?"



"నేను షూట్ చేస్తానన్నది గన్‌తో కాదు... కెమెరాతో." ఠక్కున చెప్పింది భార్య.

**"ఏ**వండీ, ఏం చదువుతున్నారు?" అడిగింది పంకజం భర్త గుర్నాధాన్ని.

"జీవితం" అన్నాడు గుర్నాధం.

"మీరు చదివేసాక నాకోసారి ఇవ్వండి... నేనూ చదువుతా!" చెప్పింది పంకజం.



**"రా**త్రి నాకో కల వచ్చింది డాక్టర్‌గారూ..."

"కలా?... ఏం కల?"

"నేను ఉదయం లేచి ఎవరి వద్దకు వెళ్లి మాట్లాడితే వారు నాకు రెండువేలు ఇవ్వాలి...లేకుంటే..."



"ఆహా అలాగా, అయితే ఎవరితో మాట్లాడావు. లేకుంటే ఏమవుతుంది?"


"మీతోనే మాట్లాడా! లేకుంటే కత్తితో పొడిచి కసాకసా చంపేస్తా!"

"ఇంద రెండు వేలు...ఇంకెప్పుడూ నా వద్దకు రాకు!"

**"చీ**ర చాలా బావుందొదినా... ఎక్కడ కొన్నావు?"

"కూరగాయల షాపులో."

"ఆ...!"




**"ఇ**దేమిటయ్యా! నీవు వడ్డించిన ఈ పాయసంలో పురుగు కదులుతూ వుంది. చూసుకోఅక్కర్లా...!" గట్టిగా అరిచాడు వెంకట్రావు సర్వర్‌పై.

"అయ్యో! నిజమేనండీ...వుండండి పురుగుల మందు వుంది దీంట్లో స్ప్రే చేసేస్తా... ఒక్క నిముషంలో పురుగు చచ్చి పోతుంది. అప్పుడు నిరభ్యంతరంగా తాగేయండి." ఠక్కున అన్నాడు సర్వర్.



**"ఒ**రేయ్ మధూ! నీవు తెగ అల్లరి చేస్తున్నావ్, గోడ కుర్చీ వేయి."

"అలాగేనండీ... మీరు ప్రక్కకి తప్పుకోండి మీ కుర్చీని తీసుకెళ్లి ఆ ప్రక్క గోడకి వేస్తా!





"మీ సమస్యేమిటి?" తన దగ్గరికి వచ్చిన పేషెంట్‌ని అడిగాడు కళ్ళ డాక్టర్.

"నేను అందరినీ గుడ్డిగా నమ్మేస్తున్నానండీ. దానికోసం నాకేదయినా కళ్ళజోడు ఇస్తారని...!" అన్నాడు పేషెంట్.




"ఒరేయ్ రాజూ!... భూమి గుండ్రంగా వుందా?" అడిగారు టీచర్.

"ఏమో సార్! నేనెప్పుడూ కొలవలేదు." ఠక్కున చెప్పాడు రాజు.



"కళ్ళు తిరుగుతున్నాయి డాక్టర్..." అన్నాడు పేషెంట్.

"ఆహా అలాగా!... ఇప్పటికి ఎన్ని కిలో మీటర్లు తిరుగుంటాయ్?!" నవ్వుతూ అడిగాడు చమత్కారి డాక్టర్.



"నాకూ కొంత మేజిక్ వచ్చు, మీరను మతిస్తే కొద్దిగా చేసి చూపిస్తా!" మెజీషియన్‌తో అన్నాడు సుబ్బారావు.

"ఓహో! అయితే మీరేం చేస్తారు?"

"మీలా ఈ అమ్మాయిని మాయం చేస్తా! తెర ఒకసారి మూసి లేపండి."

"అయితే మాయం చేసి చూపండి...?

తెర మూసిన వెంటనే సుబ్బారావు అమ్మాయిని వెనుక ద్వారం గుండా బయటకు పంపించేసాడు.

"ఏదీ? ఆ అమ్మాయిని మరల ప్రత్యక్షం చేయరే...మాయం చేసారుగా! మరలా చూపించరే?" అడిగాడు మెజీషియన్.

"నేను ముందే చెప్పాను కదా!.. నాకు కొంత మ్యాజిక్ మాత్రమే వచ్చునని ఆ అమ్మాయిని మీరే ప్రత్యక్షం చేయండి." చెప్పి కిందికి దిగిపోయాడు సుబ్బారావు.


బొట్టు పెట్టించుకోండి" అంటూ గిరిజ ఇంటికి వచ్చింది లక్ష్మి.

"దేనికి?"

"మా ఇంట్లో ఫంక్షన్ ఉంది, పిలవడానికని !"

"అమ్మా ఆశ! అలాగని చెప్పి వస్తే నేను కట్టుకున్న కొత్తచీర పరిశీలించి, అలాంటిదే నీవూ కొనేస్తావేమో నేను రాను."

"ఆ...!"





"ముహూర్తం టైమయింది నాయనా! పెళ్ళికూతురి మెడలో తాళి కట్టు!..." పెళ్లి కొడుకుతో అన్నారు పంతులుగారు.

"అలాగే కడతా గానీ... పెళ్లికూతురు కదలకుండా గట్టిగా పట్టుకోండి." అన్నాడు తిక్క పెళ్లికొడుకు.



"కరెంట్‌కీ... కరెంట్ తీగకీ మధ్య వున్న సంబంధం ఏమిట్రా నాని?..." అడిగారు టీచర్.

"బిల్‌కీ, బిల్ కట్టడానికి ఇచ్చిన స్లిప్‌కీ వున్న సంబంధమే సార్!" చెప్పాడు నాని.


"నాకు గురక వస్తుందండీ డాక్టర్‌గారూ!"

"ఇదిగో ఈ మందులు వాడండి!"

"ఈ మందులు ఎందుకు డాక్టర్‌గారూ!... ఒక పని చేయండి. గురక శబ్దం బయటకు రాకుండా నోటికి అడ్డంగా కుట్లేసేయండి."

అతితెలివి పేషెంట్ అన్నాడు.

ఖంగుతినడం డాక్టర్‌వంతయింది.



# ఎన్నికల్లో ఎన్ని కళలో?

బుద్ధవరపు కామేశ్వరరావు
98480 47322


**రాష్ట్రంలో అన్ని పంచాయితీలకూ ఎన్నికలు ప్రకటించడంతో, అనుమానాపురం గ్రామంలో కూడా ఎన్నికల సందడి మొదలైంది.**

**కిందటిసారి ఎన్నికల్లో నెగ్గిన జిత్తుల జంబూకరావు, మళ్లీ ఈసారి కూడా పోటీ చేస్తున్నాడు.**

**ఊర్లో అందరికీ తలలో నాలుకలా ఉండే వాయసరావును తన కొంపకు పిలిపించుకుని– "ఇదిగో వాయసా! ఈ సారి కూడా నా అదృష్టం పరీక్షించుకోడానికి ఓ రాయేసా! నీకు తెలుసుగా... నాకు నక్క గుర్తు కేటాయించారు. మన ప్రత్యర్థి దాగుల విశ్వాసరావుకి కుక్క గుర్తు కేటాయించారు" చెప్పాడు జిత్తుల జంబూకరావు.**

"బాగుంది దొరా! ఇద్దరికీ కూడా సరిపోయే గుర్తులే కేటాయించారు!" ఆయాస పడుతూ చెప్పాడు వాయసరావు.

"నిన్ను తగలెయ్యా!... నీకు అలా అర్థమ య్యిందా? ఇలాంటి పనికిరాని సలహాలు ఇవ్వడం కాదు, నువ్వు చెయాల్సిన పని వేరే ఉంది!" మందలిస్తూ చెప్పాడు జంబూకరావు.




"ఏంటి దొరా అది?" అడిగాడు వాయస రావు అనుమానంగా.

"ఏం లేదురా... నువ్వు గ్రామంలోని ప్రతీ ఇంటికి వెళ్లి... 'ఆ కుక్క గుర్తుకు ఓటు వేయ వద్దని... ఆ కుక్క గుర్తుకు ఓటేస్తే మీ బతుకు కుక్కబతుకే అనీ, నిజమైన కుక్కకు విశ్వాసం ఉంటుంది కానీ, ఈ కుక్కకు ఉండదనీ, పొర పాటున ఈ కుక్క గుర్తుకు ఓటేస్తే మన గ్రామం కుక్కలు చింపిన విస్తరి అవుతుందనీ, కాబట్టి కుక్క గుర్తుకు కాకుండా మన నక్క గుర్తుకే ఓటేయమని' అందరికీ చెప్పాలి... అర్థ మయ్యిందా?" విషయం చెప్పాడు జంబూకం.

"బెమ్మాండంగా అర్థమయ్యింది దొరా! మరి ఖరుసులకి ఓ లచ్చ రూపాయలు..." నసు గుతూ అడిగాడు వాయసం.

"నేను నెగ్గగానే, కిందటిసారిది, ఈసారిది కలిపి, ఒకేసారి రెండు లక్షలు ఇచ్చేస్తానులేరా! అందాక ఇదుంచు'' అంటూ వంద రూపాయల నోటు చేతిలో పెట్టి, నవ్వుతూ చెప్పాడు జంబూకం.

"సరే దొరా!... అలాగే కానీయండి..." జంబూకం ఇచ్చిన పాయసం తింటూ చెప్పాడు వాయసం.

✦✦✦

కొన్ని రోజులు తరువాత...

ఎన్నికలు ప్రశాంతంగా జరిగి, ఫలితాలు కూడా వచ్చాయి.

జంబూకరావు కబురు పంపగానే రెక్కలు కట్టుకుని జంబూకం ఇంటి ముందు వాలిన వాయసం...

"ఏంటి దొరా? ఏమయ్యింది?" అడిగాడు అమాయకంగా.


"ఏమవ్వడం ఏమిట్రా? ఇదిగో.. నీలాంటో డితో పెట్టుకున్నాను చూడూ... అందుకు నన్ను నేననుకోవాలి. అసలే నీకు పరిజ్ఞానం తక్కువ పరధ్యానం ఎక్కువ. ఔనూ... అసలు నువ్వు గ్రామ ప్రజలకు ఏం చెప్పావురా? అందరూ గంపగుత్తగా ఆ కుక్క గుర్తుకే వేసారు. నాకు ఒక్కడు కూడా వేయలేదు!" కోపంగా అడిగాడు జంబూకరావు.

"మీరు చెప్పినట్లే, 'ఆ కుక్క గుర్తుకు ఓటు వేయవద్దని... ఆ కుక్క గుర్తుకు ఓటేస్తే మీ

బతుకు కుక్కబతుకే అనీ... నిజమైన కుక్కకు విశ్వాసం ఉంటుంది కానీ, ఈ కుక్కకు ఉండ దనీ, పొరపాటున ఈ కుక్క గుర్తుకు ఓటేస్తే మన గ్రామం కుక్కలు చింపిన విస్తరి అవు తుందనీ కాబట్టి కుక్క గుర్తుకు కాకుండా మన నక్క గుర్తుకే ఓటేయమని' చెప్పాను దొరా!" చెప్పాడు వాయసం.

"బాగానే చెప్పావు... మరి ఎక్కడ తేడా కొట్టిందంటావ్?"అనుమానం వ్యక్తపరిచాడు జంబూకరావు.

"ఒహో! ఇప్పుడు నాకు అర్థమైంది దొరా!... మనం ఎక్కువగా కుక్క గుర్తు గురించే చెప్పడం వలన, అందరికీ మనసులో అది ఉండిపోయి ఆ కుక్క గుర్తుకే ఓటు వేసేసి







ఉంటారు... ఔనూ... మరి మీ ఓటు కూడా మీరు వేసుకో లేదా?'' అనుమానంగా అడిగాడు వాయస రావు.

"బహుశా నేను కూడా అదే దృష్టిలో ఉండి ఆ దిక్కుమాలిన కుక్క గుర్తుకే వేసేసి ఉంటా నురా!" నిట్టూరుస్తూ చెప్పాడు జంబూకం.

"సరే దొరా! మరి నాకు ఇవ్వవలసిన ఆ డబ్బులు???" చేతులు నలుముకుంటూ అడి గాడు వాయసరావు.

"అత్త అడుక్కుంటూంటే అల్లుడు మనుగుడు పులుకు వచ్చాట్ట! అలా ఉంది నీ వ్యవహారం. ఇక్కడ ఓడిపోయి నేను ఏడుస్తూంటే... నీకు డబ్బులు కావాలా? ఎవడితో చెప్పుకుంటావో, చెప్పుకో! నీకు ఓ పైసా కూడా ఇచ్చేదిలేదు, ముందు బయటకు పో!" అంటూ తలుపు మూసేసాడు జంబూకరావు.

"ఇంక ఎవరితోనూ చెప్పుకోనవసరం లేదు జంబూకం... నీ జిత్తుల గురించి నాకు బాగా తెలుసు. కిందటిసారి ఎన్నికల్లో, నువ్వు గెలిచి కూడా నా డబ్బులు ఎగ్గొట్టావు... ఇప్పుడు మాత్రం ఇస్తావని నమ్మకం ఏంటి? విశ్వాసం లేనివాడు ఆ విశ్వాసరావు కాదు. విశ్వాసం లేని కుక్కవి నువ్వే. అందుకే ఆ దాగుల విశ్వాస రావు పంచన చేరి, ఆయన ఇచ్చిన లక్ష తీసు కుని, లక్షణంగా ఇంటింటికి తిరిగి విశ్వాస రావుకు ఓట్లు వేయమని చెప్పాను" మనసులో అనుకుంటూ...ఆనందంగా ఇంటి దోవ పట్టాడు వాయసరావు.

# పదానందం 16

కూర్పు: పోపూరి విశ్వనాథ్, 9133197111



| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | 3 | | 4 | |
| | | 5 | | | | 6 | 7 |
| | | | | | 8 | | |
| 9 | 10 | | | 11 | | 12 | |
| | 13 | | 14 | | | | |
| | | | | | 15 | | 16 |
| 17 | | 18 | | | | | |
| | | | | 19 | | | |

## ఆధారాలు:

**అడ్డం:**

1. ధైర్యం లేనివాడు (3)
3. ముక్క (3)
5. సునాయాసం, తేలిక (3)
6. అటునుంచి వచ్చిన తరంగం (2)
9. తిరగబడ్డ ఆడది (2)
11. కథతో కలిపి ఇలా అంటారు... (4)
13. అవమానం (4)
15. సముద్రం (3)
17. ఏ ఉద్యోగానికైనా ఇది కావాలి (4)
19. ఒక అగ్రరాజ్యం (4)

**నిలువు**

1. లోభి (4)
2. నంగనాచి, మాయలమారి (3)
3. తలక్రిందులైన భాగం, పాలు (2)
4. ఆడవారేకాదు, మగవారు కూడా కనేది (2)
7. ఈర్ష్యతో కూడిన కసి (3)
8. విరామ చిహ్నం (2)
10. నవ్వితే ఇది పండుతుందా? (4)
11. సాకు పైకొచ్చింది (2)
12. పాలమీద, పెరుగుమీద ఉండేది (3)
14. ముక్కలైన పెద్దఇల్లు (3)
15. సవ్యంగా లేని మృదువు, ఏమాటా గట్టిగా చెప్పలేక పోవడం... (3)
16. తలకిందులైన ప్రసిద్ధ విదేశీ దానిమ్మ (3)
17. ఋణం (2)
18. నింపడం (2)

సమాధానం వచ్చే సంచికలో...

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 చి | రా | 2 కు | | 3 ప | | | 4 ప |
| టి | | ప్పి | | 5 రా | య | బా | రి |
| కె | | 6 గం | జా | యి | | | ణ |
| 7 న | క | తు | | | 8 ని | ర్ఘ | యం |
| | | 9 లు | 10 కో | డు | వే | | |
| 11 కూ | 12 న | | రి | | 13 ది | వా | 14 లా |
| | 15 క | ళ్ళ | క | 16 ల | క | | ప |
| 17 బా | లు | | | క్ష్యం | | 18 కా | కా |

మనోవికాసానికి మందు ఆనందం!
హాస్యానందం
తోనే ఇది సాధ్యం!
చందాదారులుగా
చేరండి. నవ్వుని మీ స్వంతం చేసుకోండి!

Owned & Published by : Ramu Panda from D.No.8-215/4, Yerrabalem, Guntur Dist.
Printed at: Rainbow Print Pack, Hyderabad. Edited by.Ramu.P

THE LARGEST CIRCULATED TELUGU WEEKLY AND MONTHLY

# స్వాతి

సపరివార పత్రిక



40th YEAR

## అత్యధిక సర్క్యులేషన్ గల పత్రికలో...



## కలియుగ ప్రత్యక్ష దైవం
## శ్రీ వేంకటేశ్వర స్వామి లీలలు...

డా॥ కె.వి. రమణాచారి గారి

(పూర్వ కార్యనిర్వహణాధికారి, టి.టి.డి)


అనుభవాల సమాహారం...

## హరే...శ్రీనివాసా!

ధారావాహిక చదవండి!



Hasyanandam November-2024. RNI No. APTEL 08387/01/1/2003-TC



చవకబారు వస్తువులు విలువైనవి కావు...
విలువైన వస్తువులు చవకగా ఉండవు!!

Jaquar

**Sambamurty Enterprises**
12-10-04, Convent Street, Vijayawada-520 001.
fone: 0866-2563824, 9676444548